



# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 11-08-2021 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 284 పేజీలు : 8 వెల : 1 రూపాయి

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా ఎంపీ విజయసాయిరెడ్డి

## ఏకగ్రీవ ఎన్నిక



ఢిల్లీ: పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. విజయసాయిరెడ్డితో పాటు మరో సభ్యుడిగా బీజేపీ ఎంపీ సుధాంశు త్రివేది ఎన్నికయ్యారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటరీ జనరల్ దేశ్‌దీపక్ శర్మ.. పార్లమెంట్ బులిటెన్ విడుదల చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ కేంద్ర ప్రభుత్వ ఖాతాలను పరిశీలించనుంది.

## గ్యాస్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త

న్యూఢిల్లీ : గ్యాస్ వినియోగదారులకు కేంద్రం శుభవార్త. ఉజ్వల 2.0 పథకం కింద లబ్దిదారులకు ఉచిత ఎల్‌పీజీ కనెక్షన్లు అందించే కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర బడ్జెట్‌లో పీఎంయూవై పథకం కింద మరో కోటి గ్యాస్ కనెక్షన్లను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తొలి విడతలో ఎల్‌పీజీ కనెక్షన్లు పొందలేక పోయిన పేద కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లను అందించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రధాని మోదీ మంగళవారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మహెూబా జిల్లాలో జరిగిన కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఉజ్వల 2.0లో యూనియన్ పెట్రోలియం మినిస్టర్ హర్దీప్ సింగ్ పూరి, ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్యాలు పాల్గొన్నారు.

# ప్రతి చేనేత కుటుంబానికి అండగా ఉంటాం

'వరుసగా మూడో ఏడాది నేతన్న నేస్తం ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నాం'

వైఎస్సార్ నేతన్న నేస్తం లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన సీఎం జగన్




అమరావతి: కరోనా కష్టకాలంలోనూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరుసగా మూడో ఏడాది 'వైఎస్సార్ నేతన్న నేస్తం' అమలు చేసింది. 'వైఎస్సార్ నేతన్న నేస్తం' కింద అర్హులైన 80,032 మంది నేతన్నలకు రూ.192.08 కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో కంప్యూటర్ బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మాట్లాడుతూ, మరో మంచి కార్యక్రమానికి నాంది పలికామని, 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' ద్వారా 80వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. తన పాదయాత్రలో చేనేతల కష్టాలు చూశానని, ఇచ్చిన మాట ప్రకారం చేనేతలకు ఆర్థిక సాయం చేస్తున్నామని సీఎం అన్నారు. "వరుసగా మూడో ఏడాది నేతన్న నేస్తం ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నాం. మూడో విడత కింద రూ.192.08 కోట్లు జమ చేస్తున్నాం. దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేతలకు ఆర్థిక సాయం అందిస్తున్నాం. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.24వేల చొప్పున సాయం చేస్తున్నాం. భవిష్యత్‌లో కూడా ప్రతి చేనేత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అవినీతి, వివక్షకు తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే నగదు జమ చేస్తున్నాం. అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని వారు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆప్కో ద్వారా ఈ-మార్కెటింగ్ తీసుకొచ్చామని సీఎం జగన్ అన్నారు. మగ్గం కలిగిన, అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.24,000 చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం చేసింది. ఐదేళ్లలో ప్రతి లబ్ధిదారుడికి రూ.1,20,000 చొప్పున ఆర్థిక సాయం అందనుంది. ఇప్పటికే 2 విడతల్లో సాయం అందగా తాజాగా మూడో విడత సాయాన్ని అందచేయడం ద్వారా అర్హులైన ప్రతి నేతన్నకు రూ.72,000 చొప్పున ప్రయోజనం చేకూరనుంది. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో నేతన్నలకు ప్రభుత్వం రూ.383.99 కోట్లు అందచేసింది. మంగళవారం మూడో విడత కింద ఇచ్చిన రూ.192.08 కోట్లతో కలిపితే నేతన్నలకు రూ.576.07 కోట్ల సాయం అందించినట్లయింది.

## సీఎం జగన్‌ను కలిసిన బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్



తాడేపల్లి: బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ (ఏపీ, తెలంగాణ) డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్, బ్రిటీష్ ట్రేడ్, ఇన్వెస్టిమెంట్ హెడ్ వరుణ్ మాలి, పలువురు బృంద సభ్యులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని బ్రిటన్ టీంను కోరారు. ఏపీలో ఆరోగ్యం, ఇంధనం, విద్యుత్ వాహనాలు, వ్యవసాయ టెక్నాలజీ, వాతావరణ మార్పులు వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తిగా ఉన్నట్లు బ్రిటన్ టీం సీఎం జగన్‌కు వివరించింది. అనంతరం సీఎం జగన్.. డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్‌ను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.



మంచి కార్యక్రమానికి నాంది

# వైఎస్ఆర్ నేతన్న నేస్తం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి..





విశాఖపట్నం : రాష్ట్రం లో చేనేత కార్మికుల సంక్షేమం కోసం సొంత మగ్గం కలిగి ఉండి దానిపై జీవనోపాధి పొందుతున్న లబ్ధి దారులకు ఆర్థిక చేయూత వై ఎస్ ఆర్ నేతన్న నేస్తం పథకం అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మూడవ విడత వైఎస్ ఆర్ నేతన్న నేస్తంలో భాగంగా మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బటన్‌ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీ ఎం మాట్లాడుతూ లబ్ధి దారుల ఎంపిక పారదర్శకంగా జరిగిందని, అర్హులయి ఉండి ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే సంబం ధిత వాలంటీర్లు, గ్రామ సచివాలయం లో దరఖాస్తు చేసుకుంటే నిర్దిష్ట కాలంలో వారికి కూడా ఇవ్వడం జరుగు తుందన్నారు. జిల్లా కలెక్టర్ డా. ఏ మల్లికార్జున మాట్లా డుతూ 2021-22 ఆర్థిక సంవత్సరానికి జిల్లా లో అర్హులైన చేనేత కార్మికులు 254 మంది ఉన్నారని,కుటుంబానికి రూ 24,000/- చొప్పున మొత్తం రూ 60,96,000/- నగదును వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగు తుందన్నారు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమం కోసం తన పాదయాత్రలో ఇచ్చిన మాటను తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాలు కులమతాలు, పార్టీల

తరువాయి 2లో..

దేశంలో 48 కోట్ల మందికి

# కోవిడ్ టెస్టులు

రాజ్యసభలో విజయసాయి రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబు



న్యూఢిల్లీ : కోవిడ్ మహమ్మారి విజృంభించినప్పటి నుంచి ఈనెల 1వ తేదీ వరకు దేశంలో 48 కోట్ల మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించినట్లు ఆరోగ్యస కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ వెల్లడించారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్సీపీ సభ్యులు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ ఈ విషయం తెలిపారు. ఈ టెస్టుల నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా ఐసీఎంఆర్ ఆమోదం పొందిన 2838 టెస్టింగ్ లేబొరేటరీలను వినియోగించినట్లు ఆమె చెప్పారు. ఇందులో 1742 ఆర్టీ-పీసీఆర్ లాబ్‌లు, 946 ట్రూనాట్ లాబ్‌లు, 131 సీబీనాట్ లాబ్‌లు, 19 ఇతర మాలిక్యులర్ న్యూక్లియక్ యాసిడ్ టెస్టింగ్ వేదికలు ఉన్నట్లు తెలిపారు.

ఆర్‌టీ-పీసీఆర్ వ్యవస్థను పటిష్టం చేసేందుకు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 495 ఆర్టీ-పీసీఆర్ యంత్రాలు, 225 ఆర్ఎన్ఏ ఆటోమేటెడ్ ఎక్స్‌ట్రాక్టర్లను కేంద్ర ప్రభుత్వం అందచేసినట్లు మంత్రి చెప్పారు. టీబీ పరీక్షల కోసం దేశీయంగా వినియోగించే ట్రూనాట్ మెషీన్లను కోవిడ్ టెస్టింగ్ కోసం వినియోగించడం జరిగింది. అలాగే టీబీ పరీక్షల కోసం వినియోగించే జీన్ ఎక్స్‌పర్ట్ యంత్రాలను కూడా కోవిడ్ టెస్టింగ్ కోసం వాడటం జరిగింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సర్టిఫికేషన్ పొందడానికి విధిగా దేశంలోని అన్ని మెడికల్ కాలేజీలు మాలిక్యులర్ వైరాలజీ వ్యవస్థ కలిగి

తరువాయి 2లో..

## కేంద్ర ప్రభుత్వ తీరుపై ఏపీ హైకోర్టు సీరియస్

అమరావతి: కేంద్ర ప్రభుత్వంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీరియస్ అయింది. ఉపాధి హామీ నిధుల చెల్లింపుల అంశంపై మంగళవారం ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. 2014 నుంచి 2019 వరకు చెల్లింపులకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని గతంలో కేంద్రానికి హైకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలో కేంద్రం ఇప్పటివరకు అఫిడవిట్ దాఖలు చేయకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారంరోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈనెల 17లోపు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయకపోతే బాధ్యులకు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని హైకోర్టు హెచ్చరించింది.




# ఆఫ్‌లైన్‌లోనే పాఠశాలలు నిర్వహిస్తాం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్

అమరావతి: ఈ నెల 16వ తేదీ నుంచి రాష్ట్రంలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ వెల్లడించారు. సాధారణ పనివేళల్లోనే పాఠశాలలు నడిపిస్తామన్నారు. అన్ని పాఠశాలల్లో కొవిడ్ నిబంధనలు పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 95 శాతం మంది ఉపాధ్యాయులకు వ్యాక్సినేషన్ పూర్తి అయిందన్నారు. మిగిలిన వారికి కూడా టీకాలు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ఆన్‌లైన్ తరగతులు జరగడం లేదని.. ప్రైవేటు పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించొద్దని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ నెల 16 నుంచి ఆఫ్‌లైన్‌లోనే పాఠశాలలను నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు.



# ప్రతి అడుగు... మీ మంచికే...

శ్రీకాకుళం : ప్రతి అడుగు మీకు మంచి చేయుటకు వేస్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఇ - మార్కెటింగ్ సౌకర్యం కల్పించుటకు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పారు. అప్కో ఇందులో చేరాలని ఆయన సూచించారు. వైయస్సార్ ఆర్ నేత నేస్తం కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. వరుసగా మూడవ ఏడాది నేతన్న లకు ఆర్థిక సహాయం కార్యక్రమాన్ని అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 80 వేల 32 మంది నేతన్నలకు రూ.192.08 కోట్లను ఈ ఏడాది అందిస్తున్నామన్నారు. గత రెండు సంవత్సరాల్లో రూ. 576.07 కోట్ల ను నేతన్నలకు అందించడం జరిగిందని ఆయన తెలిపారు దేశ చరిత్రలోనే తొలిసారిగా చేనేత కుటుంబాలకు పారదర్శకంగా లబ్ధి చేకూర్చే అభివృద్ధి పథకం ప్రవేశపెట్టడం జరిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లలో స్వంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబాన్ని ఆదుకునేందుకు బడ్జెట్ లో వెయ్యి కోట్లు కేటాయించామని ఆయన పేర్కొంటూ ప్రతి లబ్దిదారునికి రూ.1.20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించుటకు నిర్ణయించామని చెప్పారు. అర్హత కలిగిన వారు ఈ జాబితాలో లేకపోతే సచివాలయంలో దరఖాస్తు సమర్పించ వచ్చని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 2021 - 22 సంవత్సరంలో 1601 మందికి రూ.3.84 కోట్లను నేతన్న నేస్తంగా అందించడం జరుగుతుందని తెలిపారు. 2020 - 2021లో 1775 మందికి రూ. 4.26 కోట్లు, 2019 - 20 సంవత్సరంలో 1457 మందికి రూ.3.50 కోట్లు అందించామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు లాంఛనంగా చెక్కులను పంపిణీ చేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, శాసన మండలి సభ్యులు దువ్వాడ శ్రీనివాస్, శాసనసభ్యులు కంబాల జోగులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరి బాబు, మామిడి శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ ఆర్. శ్రీరాములు నాయుడు, మాజీ కేంద్ర మంత్రి డా.కిల్లి కృపారాణి, చేనేత సహకార సంఘం ప్రతనిధులు చంద్రయ్య, కె. రవి, ప్రకాష్, చేనేత శాఖ ఎడి ఎస్ కె అబ్దుల్ రషీద్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.









## మొదటి పేజీ తరువాయి

## మంచి కార్యక్రమానికి నాంది వైఎస్ఆర్ నేతన్న నేస్తం

కతీతంగా వివక్షత లేకుండా దేశంలోనే ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అర్హులందరికి ఆర్థిక చేయూత నిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల క్యాలెండరు ను ప్రకటించి ఆయా తేదీల ప్రకారం పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సమాజంలో అందరిని ముందుకు తీసుకు వెళుతూ చిత్తశుద్ధితో ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పని చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున వై ఎస్ ఆర్ నేతన్న నేస్తం లబ్దిదారులకు రూ 60,96,000/- చెక్కును అందజేసారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, శాసన సభ్యులు గుడివాడ అమర్ నాద్, నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె.రాజు నేతన్న నేస్తం లబ్దిదారులు హాజరైయారు.

**లబ్దిదారుల స్పందన మాకుటుంబాలలో వై ఎస్ ఆర్ నేతన్న నేస్తం విశేష సంతోషాన్ని తీసుకు వచ్చింది. : గోరు వీర నాగేశ్వరరావు**

గతంలో ఏ రోజుకారోజు తింటూ పూట గడవని పరిస్థితులో పేదరికాన్ని అనుభవించామని అటువంటి సమయంలో నేనున్నాను అంటూ జగనన్న మా చేనేత కార్మికులకు అండగా నిలిచి మా మగ్గాలను తిరిగి పని చేసుకొనే విధంగా కుటుంబానికి 24 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారని పాయకరావుపేట మండలానికి చెందిన గోరు వీర నాగేశ్వరరావు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. తన వయస్సు 54 సంవత్సరాలు అని 30 సంవత్సరాల నుండి నేత నేస్తున్నామన్నారు. తన కుటుంబం మొత్తం ఈ పని లోనే ఉంటారన్నారు. తన భార్య ఎస్ హెచ్ జి గ్రూపులో ఉండి సున్నా వడ్డీ పథకం పొందిందని, తన ఇద్దరు పిల్లలకు అమ్మఒడి వచ్చిందని , తాను నెల వారి చేనేత పింఛన్ అందుకుంటున్నానని మా జగనన్న వచ్చి అన్ని విధాలుగా మమ్ములను కష్టాల నుండి ఆదుకున్నారని ఎప్పటికి ఆయనే మా ముఖ్యమంత్రిగా ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నామన్నారు.

**కరోనా కష్టకాలంలో మమ్ములను జగనన్న ఆదు కున్నారు. ఆది నాగ సత్యన్నారాయణ**

నక్కపల్లి మండలానికి చెందిన ఆది నాగ సత్యన్నారాయణ మాట్లాడుతూ తాను 6వ తరగతి చదువుతున్నప్పటి నుండి తన తల్లిదండ్రులకు సాయంగా మగ్గం నేత నేసేవాడునని 10వ తరగతిలో చదువు ఆపేసానని ప్రస్తుతం చేనేత వృత్తిలోనే ఉంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్నానన్నారు. కరోనా కష్ట సమయంలో ఎటువంటి పని లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డామని, ఆ సమయరలో జగనన్న ఉచిత రేషన్ సౌకర్యం కల్పించడంతో పాటు 24 వేల రూపాయలను ఆర్థిక సహాయం అందించి మమ్ములను ఆదుకున్నారన్నారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, అమ్మఒడి వచ్చిందని, నాన్నకు పింఛన్ వస్తుండగా అమ్మ ఎస్ హెచ్ జి గ్రూపులో ఉన్నదని మా ముఖ్యమంత్రి జగనన్న కుటుంబానికి ఆసరగా నిలిచారని ఆయనకు ఎప్పటికి రుణపడి ఉంటామన్నారు.

## దేశంలో 48 కోట్ల మందికి కోవిడ్ టెస్టులు

ఉండాలని ఆదేశిస్తూ గత జూన్‌లో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు. దీని వలన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలలో కోవిడ్ పరీక్షల నిర్వహణ సదుపాయం కల్పించినట్లయిందని ఆమె చెప్పారు. ఆర్టీ-పీసీఆర్ పరీక్షలతో పోలిస్తే రాపిడ్ యాంటిజెన్ టెస్టుల ఫలితాలలో కచ్చితత్వం తక్కువగా ఉంటున్నందున కోవిడ్ లక్షణాలు కలిగి ఉండి రాపిడ్ యాంటిజెన్ టెస్టులో నెగెటివ్ వచ్చిన వ్యక్తులు ఆర్టీ-పీసీఆర్ టెస్ట్ చేయించుకోవాలని ఐసీఎంఆర్ సిఫార్సు చేసినట్లు మంత్రి తెలిపారు.

**పారదర్శకత కోసమే కంపెనీల చట్ట సవరణ...**

కంపెనీలు ప్రకటించే ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలో మరింత పారదర్శకత తీసుకు వచ్చేందుకే కంపెనీల చట్టంలోని షెడ్యూలు 3ను సవరించినట్లు కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రావు ఇందర్‌జిత్ సింగ్ రాజ్యసభకు తెలిపారు. వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ కంపెనీలు ఏటా ప్రకటించే ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలో క్రిప్టో కరెన్సీ, వర్చువల్ కరెన్సీ లావాదేవీలు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యకలాపాల కింద ఆయా కంపెనీలు చేస్తున్న ఖర్చుల వివరాలను వెల్లడించేందుకు వీలుగా కంపెనీల చట్టంలోని షెడ్యూలు 3ను సవరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సవరణ ద్వారా ప్రతి కంపెనీ ఆ ఆర్థిక సంవత్సరంలో క్రిప్టో కరెన్సీ లేదా వర్చువల్ కరెన్సీ ద్వారా నిర్వహించిన లావాదేవీలు, వాటిలో పెట్టిన పెట్టుబడుల వివరాలను ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్‌లో విధిగా వెల్లడించాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. అలాగే సీఎస్ఆర్ కార్యకలాపాల కోసం చేస్తున్న ఖర్చు, వాటి స్వభావం, సీఎస్ఆర్ కార్యకలాపాల కోసం వెచ్చించే మొత్తంలో తరుగుదల వస్తే వాటి వివరాలు ఆయా కంపెనీలు తమ ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్లలో పొందుపరచాల్సి ఉంటుందని మంత్రి చెప్పారు.

**పీఏసీ సభ్యుడిగా విజయసాయి రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక**

కేంద్ర ప్రభుత్వ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) సభ్యులుగా వైఎస్సార్సీపీకి చెందిన వి.విజయసాయి రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని రాజ్య సభ సెక్రటరీ జనరల్ దేష్ దీపక్ వర్మ ఒక బులెటెన్ ద్వారా అధికారికంగా ప్రకటించారు. రాజ్యసభ నుంచి గతంలో పీఏసీ సభ్యులుగా వ్యవహరించిన భూపేందర్ యాదవ్, రాజీవ్ చంద్రశేఖర్ కేంద్ర మంత్రివర్గంలో చేరడంతో వారి స్థానాలు ఖాళీ అయ్యాయి. ఖాళీ అయిన ఈ రెండు స్థానాలకు నామినేషన్లు ఆహ్వానించగా విజయసాయి రెడ్డితోపాటు బీజేపీకి చెందిన డాక్టర్ సుధాంశు త్రివేది నామినేషన్లు దాఖలు చేశారు. ఇతరులెవరూ పోటీలో లేకపోవడంతో వీరిద్దరూ పీఏసీకి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రకటించారు.

# మూగజీవులకు మా సహాయ'ం'




మధురవాడ: మనుషులనే పట్టించుకోని ఈ రోజుల్లో మూగజీవులకు చేసిన సహాయ కార్యక్రమం జంతు ప్రేమికుల తో పాటు పలువురును ఆకట్టుకున్నారు. మా సహాయ వెల్ఫేర్ సొసైటీ (పి.ఎం.పాలెం) 4 వ వార్షికోత్సవ వేడుక సందర్భంగా మంగళవారం కొమ్మాది ఓజోన్ వ్యాలీ సమీపంలోగల విశాఖ సొసైటీ ఫర్ అనిమల్స్ ప్రివెన్షన్ అండ్ క్యారింగ్ సెంటర్ లో వున్నా పశుపక్ష్యాదులు (ఆవులు, శునకాలు, పిల్లులు, చెవులపిల్లులు,కోతులు, తాబేళ్లు) మొదలైన మూగజీవులు ఆహారం తీసుకోవడానికి వీలుగా సుమారు నాలుగువేల రూపాయలు విలువచేసే, 20 బేసన్లు, బకెట్లు, ఆహారం వస్తువులు, టబ్బులను సెంటర్ ఇంచార్జ్ శారదకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యానిమల్స్ సెంటర్ లో 750కి పైగా వివిధ రకాలైన జంతువులు ఉన్నాయని,ఈ కరోనా సమయంలో మన తోటివారికే కాకుండా మూగజీవులకు కూడా సహాయం చేసే భాగ్యం కలగడం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సహయ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ రాధారాణి అగర్వాల్, నాగేంద్ర లాల్ తదితరులు పాలుగున్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్, ఫాగింగు చేయండి

- జివిఎంసి అదనపు కమిషనర్ డా. వి. సన్యాసి రావు



విశాఖపట్నం : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా స్ప్రేయింగ్, ఫాగింగు చేయించాలని జివిఎంసి అదనపు కమిషనర్ డా. వి. సన్యాసిరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన 6వ జోన్ 75వ వార్డు దొగ్గవాని పాలెం పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ వార్డులో డెంగ్యూ కేసులు నమోదు అవుతున్నాయని, మలేరియా సిబ్బంది వార్డులో ప్రతీ ఇంటిని సర్వే చేసి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, డెంగ్యూ కేసు నమోదైన ఇంటిలోను పరిసరాలను స్ప్రేయింగ్, ఫాగింగు దగ్గరుండి చేయించారు. నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిసరాలు డ్రైగా ఉండే ఉండే విధంగా చూడాలని, కాలువలోని చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో బయాలజిస్ట్ దొర, మలేరియా ఇన్స్పెక్టర్ ఈశ్వరరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



దిల్లీ: ఓబీసీలను గుర్తించే హక్కు తిరిగి రాష్ట్రాలకే కట్టబెడుతూ కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ చట్టసవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. గతంలోనే ఈ బిల్లుకు ప్రతిపక్ష పార్టీలు మద్దతు ప్రకటించాయి. 127వ రాజ్యాంగ సవరణ బిల్లు -2021ను లోక్ సభలో ప్రవేశ పెట్టిన సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి వీరేంద్రకుమార్ మాట్లాడుతూ.. 671 కులాలకు ప్రయోజనం చేకూర్చే చరిత్రాత్మక చట్టంగా పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ పరిధిలోని ఓబీసీ కులాలను గుర్తించే హక్కును పునరుద్ధరించటం ద్వారా ఎన్నో కులాలకు సామాజిక, ఆర్థిక న్యాయం కలిగించవచ్చన్నారు. ఇందుకోసం అధికరణ 342ఏతో పాటు 338బీ, 366ను కూడా సవరించాల్సి ఉందని కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్ తెలిపారు. ఈ బిల్లుపై చర్చ ప్రారంభించిన కాంగ్రెస్ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ఓబీసీ బిల్లుకు మనస్ఫూర్తిగా మద్దతిస్తున్నట్టు చెప్పారు. 2018లో చేసిన 102 రాజ్యాంగ చట్ట సవరణను తప్పుబట్టిన ఆయన .. నాడు ప్రతిపక్షాలు చేసిన సూచన చట్టంలో చేర్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన ఓబీసీ బిల్లుకు వైకాపా మద్దతు తెలిపింది. ఓబీసీ కులాలను గుర్తించే హక్కును తిరిగి రాష్ట్రాలకు కట్టబెడుతూ రాజ్యాంగ చట్టసవరణ చేయడాన్ని పూర్తిగా స్వాగతిస్తున్నట్టు వైకాపా ఎంపీలు తెలిపారు. వెనుక బడిన వర్గాల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ ఆదినుంచి కట్టుబడి ఉందని తెదేపా ఎంపీ రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. 3 దశాబ్దాల క్రితమే మండల్ కమిషన్ ప్రతిపాదించిన రిజర్వేషన్లు తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్ స్వాగతించారని సభకు గుర్తు చేశారు.

# బాబు బండారం బయటపెడతాం




**- విద్యుత్ కొనుగోలుల్లో రూ.22,868 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం**

**- త్వరలోనే బాబు అండ్ కో అక్రమాలు బయటపెడతాం**

**- విద్యుత్ సరఫరాను 60శాతానికి పెంచడటమే లక్ష్యం**

**- మీట్ ది ప్రెస్‌లో రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు**

విశాఖపట్నం : టీడీపీ ప్రభుత్వం హాయంలో విద్యుత్ కొనుగొలుకు సంబంధించి రూ.22,868 కోట్ల రూపాయాల ప్రజాధనం దుర్వినియోగం చేశారని, వాటిని త్వరలోనే పూర్తి ఆధారాలతో బాబు అండ్ కో బండారాన్ని బయటపెడతామని రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు అన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్‌లోని వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నెడ్ క్యాప్ నుంచి 42.24శాతం సరఫరా జరుగుతున్న విద్యుత్ సరఫరాను వచ్చే రెండేళ్లలో 60శాతానికి పెంచేందుకు కృషి చేస్తామన్నారు.నెడ్‌క్యాప్‌లో నవరత్నాల మాదిరిగా నవ ప్రాజెక్ట్‌లను ప్రవేశపెట్టామని, వీటిపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. రాయలసీమ ప్రాంతాల్లోని కరువు ప్రాంతాల్లో సైతం సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అదే విధంగా వాతావరణంలో కాలుష్య నియంత్రణకు త్వరలోనే ఎలక్ట్రికల్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, వీటి కొనుగోలు విషయంలో కూడా 60శాతం రాయితీ, బ్యాంక్ రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.త్వరలోనే నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఆటోలతో పాటు, ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నామని, ఇప్పటికే పలు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఇక అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలోని ఆర్టీసీ బస్ స్టేషన్‌లో కూడా మోడరన్ బస్ స్టేషన్,చార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఐటీఐ,పాలిటెక్నిక్ చదువుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా శిక్షణ అందిస్తున్నామన్నారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టులకు కూడా రాయితీతో ఎలక్ట్రికల్ వాహనాలు అందిస్తామని ప్రకటించడం అభినందనీయమని, అదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి తగిన సహాయ,సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజెఎఫ్ కార్యదర్శి సోడిశెట్టి దుర్గారావు,ఉపాధ్యక్షుడు నాగరాజు పట్నాయక్, కోశాధికారి పిఎన్ మూర్తి,జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, ఈసీ సభ్యులు ఇరోతి ఈశ్వరరావు, ఎంఎస్ఆర్ ప్రసాద్,గయాజ్,మాధవ్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజును విజెఎఫ్ పాలకవర్గం ఘనంగా సత్కరించింది

# ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న కరోనా వాక్సిన్ ను అర్హులందరూ తీసుకోవాలి



విశాఖపట్నం : ప్రభుత్వం ఉచితంగా అందచేస్తున్న కరోనా వాక్సిన్ ను అర్హులందరూ తీసుకోవాలని జీవీఎంసీ 32 వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు.మంగళవారం వార్డు పరిధి సచివాలయంలో ప్రారంభమైన మెగా వాక్సినేషన్ కార్యక్రమానికి అయన ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...


ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆలోచనావిధానాలను దేశవ్యాప్తంగా అందరూ కొనియాడుతున్నా రన్నారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా జగన్ పనిచేస్తున్నారని కొనియాడారు.

కరోనా మూడవ దశ పై వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అర్హులందరూ వాక్సిన్ తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. దాదాపు 150 మందికి సిబ్బంది వాక్సిన్ వేసినట్లు తెలిపారు. కోవాక్సిన్, కోవిషిల్డ్ రెండూ అందుబాటులో ఉన్నాయని కందుల నాగరాజు తెలిపారు.

# ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

## - ఎంపిడిఒకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ కన్నూరు దేవి





పరవాడ : పరవాడ మండల పరిషత్ అధికారి ఎమ్ పిడిఒ హేమసుందరరావుని కలిసి తాణాం గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులులో జరిగిన అవకతవకలపై మరియు ప్రోటోకాల్ పాటించిన అధికారులు పై విచారణ జరిపించి అధికారులు మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారము ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో తాణాం గ్రామం సర్పంచ్ కన్నూరు దేవి వెంకటమణ మరియు ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి వసంత రావు, 6 వార్డు మెంబర్ రొంగల అప్పారావు,1 0 వార్డు మెంబర్ పైల అప్పారావు, మాజీ వార్డు మెంబర్ దుంగల రమణ, కె.రమేష్, పైల అప్పారావు, కోడి నాని పాల్గొన్నారు.

# పచ్చని చెట్లు నాటండి : స్వచ్ఛమైన గాలిని పీల్చండి

## చెట్టుపల్లి సర్పంచ్ గజాల నాగరత్నం, సూరిబాబు



విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : పచ్చని చెట్లు నాటడం ద్వారా స్వచ్ఛమైన గాలిని పీల్చండి చెట్టు పల్లి సర్పంచ్ గజాల నాగరత్నం పిలుపు నిచ్చారు.మంగళవారం గ్రామం లోని ఎవెన్యూ ప్లాంటే షన్ లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు 200 మొక్కలు నాటేందుకు సన్నా హాలు చేశారు. ఎన్నార్జీ ఎస్ఏ పిఓ నాని బాబు సూచనమేరకు ఫీల్డ్ అసిస్టెంట్ జిలాని గ్రామంలో ఈ కార్యక్రమం ఏర్పాటు నిర్వహణ కార్య క్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ పరవాడ శ్రీనివాసరావు, వైయస్సార్ సిపి నాయకులు నానాజీ, జనసేన నాయకులు చక్రవర్తి, టిడిపి నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలోని మెయిన్ రోడ్డు తో పాటు అంతర రోడ్ల కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొనడం పట్ల ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన బీజేపీ నాయకులు



భీమునిపట్నం : ఉత్తరాంధ్ర శాసనమండలి సభ్యులు (పట్టభద్రుల ఎమ్మెల్సీ), బిజెపి ఫ్లోర్ లీడర్ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్.మాధవ్ నివాసంలో బిజేపి నాయుకులు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. అలాగే భీమిలి మండలం గొల్లల తాళ్లవలస లో గల మన కుటుంబం చారిటబుల్ ట్రస్ట్ బాలల సంరక్షణ కేంద్రం పిల్లలకు స్నాక్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి, పి.వి.వి. ప్రసాదరావు పట్నాయక్, మరియు ఆనంద పురం మండల బిజెపి నాయకులు, బంటుపల్లి ఉమ శంకర్, గండి లక్ష్మి రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆనందయ్య కరోనా నివారణ మందు పంపిణీ




గొలుగొండ : జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తమ్మిరెడ్డి శివశంకర్, బలిశెట్టి సత్యనారాయణ సూచనల మేరకు గొలగాని చారిటబుల్ ట్రస్ట్ గొలగాని రవికృష్ణ(యుఎస్ఎ) వారి సహాయంతో మంగళవారం గొలుగొండ మండలంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌కు కరోనా నివారణ మందు, కరోనా వచ్చిన వారికి కూడా మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ ఇప్పటికే నర్సీపట్నం నియోజకవర్గంలో నర్సీపట్నం, మాకవరపాలెం మండలంలో ఆనందయ్య మందు పంపిణీ చేశామన్నారు. ఈ కష్టకాలంలో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి దొరక్క ఇబ్బంది పడే వారికి నిత్యవసర వస్తువులు పంపిణీ చేశామన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో కరోనా నివారణ మందు పంపిణీ చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం గ్రామీణ అధ్యక్షుడు వూడి చక్రవర్తి, చెల్లూరి గుణశేఖర్, రామకృష్ణ, పవన్ మూర్తి, పాతాళ శివ, వెంకటరమణ, మణిబాబు పాల్గొన్నారు.

# ఏబీవీపీ విద్యార్థి నాయకుడు రాంబాబుకి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం



పాడేరు : ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పాడేరు లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో గిరిజన ప్రాంతం నుంచి మొదటి సారి ఎవరెస్ట్ అధిరోహించిన పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి మరియు ఏబీవీపీ నాయకుడు లకే రాంబాబుకి విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున్ ప్రభుత్వ విప్ బూడి ముత్యాల నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు ఐటీడీఏ పీవో గోపాల కృష్ణ సన్మానించి అభినందించారు, వీరు ప్రస్తుతం పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుమ తున్నారు.

పాడేరు ఏబీవీపీ జిల్లా స్పోర్ట్స్ కన్వీనర్ గా పనిచేస్తు విద్యార్థి ఉద్యమాలో చురుగ్గా పాల్గొంటారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా ప్రముక్ ఎం.ఎం.ల్. పాత్రుడు, ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు అంగనైని ఆనంద్, జిల్లా సంఘటన ఉప్పర అశోక్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ఎన్.ఎస్.ఎస్పీవో గౌరీ శంకర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పలువురు వారికి అభినందించారు.

## శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో

# రెండవరోజు 'శ్రావణ మాసం' పూజలు



విశాఖపట్నం : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, ఆంధ్రుల ఆరాధ్యదైవం, సౌభాగ్య ప్రదాయిని అయిన విశాఖనగరంలో గల శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 'శ్రావణ మాసం' సందర్భంగా శ్రీ లక్ష్మి పూజలు ప్రారంభించి నేటికి 2వరోజుకు చేరినవి. గత 16 సంవత్సరాలుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ శ్రీ లక్ష్మి పూజలను నిర్వహించుట జరుగుచున్నది. నేటి ఉదయం 8 గంటలకు వేద మంత్రముల మధ్య నాదస్వర సుస్వరాలు మధ్య శ్రీ లక్ష్మి పూజలు ప్రారంభించారు. 16మంది ఉభయ దాతలు స్వయంగా పాల్గొన్నారు.

మరియు పోస్టులు ద్వారా 9మంది భక్తుల పేరున పూజ నిర్వహించి వారికి కుంకుమ, శ్రీ అమ్మవారి యంత్రం & ప్రసాదములు పంపుట జరిగినది.

ఈ పూజకు కావలసిన పూజా సామగ్రి దేవస్థానం వారే సమకూర్చేదరు. పూజ రుస ఉము రూ.400/-లు.

# ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ ఎంఈఓ కు వినతి



ఎంఈఓ కి వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

చోడవరం : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్ష ణం పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల విద్యాశాఖ అధికారి పి అచ్యుత రావు కు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గూనురు వరలక్ష్మి మాట్లాడుతూ పెండింగులో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, వేతనాలు ఇవ్వాలని, వంట షెడ్ల నిర్మాణాలు చేపట్టి, వంటపాత్రలు ఇవ్వాలని, నూతన విద్యా విధానంలో భోజన పథకం కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు బుచ్చి రాజమ్మ, అమీనా, చిన్న తల్లి, రూప, అప్పయ్యమ్మ, లక్ష్మి, సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు చీరలు పంపిణీ



గాజువాక : నియోజకవర్గం పాత కర్నవానిపాలెంలో గల బీజేపి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మాదవ్ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి నరసింగరావు ఆద్వర్యంలో 250 మంది పేదలకు మంగళవారం చీరలు పంపిణీ చేసారు. డిజైర్ సొసైటీ లో గల హెచ్ఐవి పాజిటివ్ పిల్లల మద్య కేక్ కట్ చేసి పిల్లలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజున పలు సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా వుందని ప్రతి ఒక్కరు ప్రతి రోజు మంచి పనులు చేసి ప్రతి రోజు పుట్టిన రోజులా గడుపుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డా.గొర్లె సత్యనారాయణ, సిరసపల్లి నూకరాజు, కృష్ణంరాజు, బొండా యల్లాజి రావు, గూటూరు శంకరరావు, జబర్దస్త్ రమేష్ మాస్టర్ ,రోహిణి, జ్యోతి, శ్రీదేవి, నాగేశ్వరరావు, ముస లయ్య, లలిత, తాతారావు, పుష్ప లత, సత్తిబాబు, సూరి బాబు, పేర్ల.సత్యారావు, వెన్నా. శ్రీరాంమూర్తి, ఈశ్వరరావు, లక్ష్మణ్ రావు సత్య నారాయణ సిరసపల్లి అప్పారావు, కరాటే సుమన్ సుజాత ,కళావతి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా బాధితులకు న్యూట్రీషన్ల కిట్స్ పంపిణీ



కొయ్యూరు : మంగళవారం గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో కొయ్యూరు మండలం కినపర్తి పంచాయతీలో ములగలమెట్ట గ్రామంలో కరోనా బాధితులకు న్యూట్రీషన్లు కిట్స్, రక్షణ కిట్స్‌లను జియస్‌యస్ ప్రతినిధులు టి.శంకర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఈ కరోనా అవగాహన కార్యక్రమాలు మన మండలం లోని పెద్ద ఎత్తున చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మూడవ దశ కరోనా రావటానికి అవకాశం ఉందని, ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జియస్‌యస్ ప్రతినిధులు డి.రమ్య, వాలంటీర్ శ్రీను, ఆశా వర్కర్ పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## మనో నిగ్రహమే మహా సాధనం !

'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, ఎవరూ వృథాగా కాలం వెళ్లబుచ్చకూడదన్నది' మన పూర్వీకుల సందేశం. నిరంతరాయంగా, ధర్మబద్ధంగా మన కర్తవ్యాలను నిర్వహిస్తూనే 'ఆత్మోద్ధరణ' దిశగా ప్రయాణించాలి. మళ్లీ మళ్లీ పుడుతూ చనిపోయే ('పునరపి జననం, పునరపి మరణం') కర్మబంధాలలో చిక్కుకొని అలమటించే పరిస్థితిని తెచ్చుకోకూడదు. ఈ మేరకు, 'విముక్తి (మోక్షం) కలిగించే తరుణోపాయాన్ని గీతాచార్యుడే మనకు సూచించాడు.

ఉద్ధరేదాత్మ నాత్మానం నాత్మానమవ సాదయేత్
ఆత్మైవ హ్యాత్మనోబంధుః ఆత్మైవ రిపురాత్మనః?
భగవద్గీత (6-5)

సంసార సాగరం నుంచి మనల్ని మనమే ఉద్ధరింపజేసుకోవాలి. లోకంలో మనకు మనమే మిత్రులం, మనకు మనమే శత్రువులం. బయటి శత్రువులను సామదాన భేదదండోపాయాలతో జయించవచ్చు. కానీ, శరీరం లోపలి అంతశ్శత్రువులను జయించడం చాలా కష్టం. ముఖ్యంగా మనసును జయిస్తే అదే మంచి మిత్రుడౌతుంది. జయించలేకపోతే అదే మన పాలిట శత్రువువలె మారి, మనల్ని కుంగదీస్తుంది. మానవులకు అతిపెద్ద శత్రువులైన 'కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యం' (అరిషడ్వర్గాలు) అనేవి మనలోనే ఉంటాయి. ఈ అంతర్గత శత్రువులు బాహ్యమైన వాటికన్నా ఎంతో హానికరమైనవి, నిర్దాక్షిణ్యమైనవి.

ఆత్మకు ఆత్మయే బంధువు, ఆత్మకు ఆత్మయే శత్రువు. ఎవరికి దాహమేస్తే వారే నీళ్లు తాగినట్లుగా ఎవరి సాధన వాళ్లే చేసుకోవాలి. ఎవరి జ్ఞానాన్ని వాళ్లే సంపాదించుకోవాలి. సద్గురువులను ఆశ్రయించి ధ్యానసాధన చేయాలి. గురు ముఖతఃగానీ, సద్గ్రంథాధ్యయనం వల్లగానీ ఆత్మజ్ఞానాన్ని పొందినవారే ఆత్మోద్ధరణ చేసుకోగలుగుతారు. ఏ విత్తనం నాటితే అదే మొక్క మొలిచినట్లు మనం ఏ విధమైన కర్మలు చేస్తుంటామో అదేవిధమైన ఫలితాలను పొందుతాం. గురువు, శాస్త్రం, దైవం కూడా చివరికి మన ఆత్మోద్ధరణకు దారి చూపేంతవరకే పరిమితం. మన కాళ్లతో మనమే నడిచినట్లు, మన కండ్లతో మనమే చూస్తున్నట్లు, మన ఆకలిని మనమే తీర్చుకుంటున్నట్లు మనల్ని మనమే ఉద్ధరింపజేసుకోవాలి.

మనసు చంచలమైంది. ఒకవంక మంచిపనుల వైపు, మరొక వంక చెడు ఆకర్షణలవైపు అది లాగుతూ ఉంటుంది. ఇంద్రియ నిగ్రహాన్ని ప్రయత్న పూర్వకంగా సాధించిన మనిషి మహోన్నతుడవుతాడు. ఇంద్రియ వ్యామోహంలో చిక్కుకున్నవాడు పతితుడవుతాడు. దశకంఠుడైన రావణుడు పది రకాలుగా ఆలోచించేవాడట. అతని నాలుగు తలలు మంచివైపు ఉంటే, ఆరు తలలు చెడువైపు లాగేవట. ఇంద్రియ చాపల్యమే మనిషి పతనానికి హేతువవుతుందన్నది నిజం. కాంచనాన్నీ (బంగారం), గాజు ముక్కనీ సమానంగా చూడగలిగిన శ్రీ రామకృష్ణ పరమహంస లాంటి మహానుభావులు లోకంలో చాలా అరుదుగా ఉంటారు. వివేకం, వైరాగ్యం కలిగినవారే మనసును జయించగలుగుతారు. అలా, మనోనిగ్రహం కలిగినవానికే మనసు మిత్రునిలాగా మారిపోతుంది. తన ఆప్తమిత్రుడు, బాల్య స్నేహితుడైన శ్రీ కృష్ణుని ఏదో అడగాలనే కోరికతో కుచేలుడు వెళ్లినా, స్వామి దివ్యత్వాన్ని కండ్లారా చూశాక, ఏమీ కోరకుండానే వచ్చేస్తాడు. అడగకుండానే ఐష్టైశ్వర్యాలనూ ప్రసాదిస్తాడు శ్రీకృష్ణ పరంధాముడు. అనన్య స్నేహభక్తి కుచేలునిదైతే, ఆశ్రిత వత్సలత పరమాత్మ తత్త్వం.

మనిషి ఎల్లవేళలా ధర్మబద్ధమైన, సకల ప్రాణి హితమైన కర్మలనే ఆచరించాలి. మనం చేస్తున్న పనులెలాంటివో ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ ఉండాలి. సాధనతో జ్ఞానాన్ని సమీకరించుకోవాలి. సృష్టిలోని ప్రతి ప్రాణినీ పరమాత్మ స్వరూపంగా చూస్తూ, ప్రేమభావంతో మెలగాలి. అమూల్యమైన కాలాన్ని వృథా చేయకుండా నిరంతరం సత్కర్మాచరణలతో మనసును అదుపులో ఉంచుకోవాలి. నకారాత్మక మనోభావాల (నెగెటివ్ థాట్స్) ప్రభావం వల్లనే ఒత్తిడి, కోపం, విపరీత ధోరణులు, దీర్ఘకాలిక అనారోగ్యం వంటివి కలుగుతాయని మనస్తత్వ శాస్త్రవేత్తలూ అంటారు.

## ఉనికిని కాపాడుకోడానికే విపక్షాల తప్పుడు ఆరోపణలు

### - కార్పొరేటర్ మహ్మద్ సాధిక్



మద్దిలపాలెం : తెలుగుదేశం, బిజెపి, జనసేన, వామపక్షాలు కేవలం తమ ఉనికిని కాపాడుకోవడానికి అధికార పార్టీపై తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారని జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాపిటల్ వ్యాల్యూ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆస్తిపన్ను గురించి అవగాహన లేక విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని తెలిపారు. షాపింగ్ మాల్లు ఇతర వ్యాపార సముదాయాల పనులను టిడిపి హయాంలో తగ్గించేసారని, నేడు ఆస్తిపన్ను ప్రవేశపెట్టగానే వారంతా ఆందోళనకు తిగుతున్నారని తెలిపారు. 370 ఎస్ ఎఫ్ టి తక్కువగా ఉంటే సంవత్సరానికి 50 రూపాయలు తీసుకోమని ముఖ్యమంత్రి ట్యాక్స్ నిర్ణయించారని, అది ఒక చారిత్రాత్మక నిర్ణయం అని కొనియాడారు. దీనివల్ల జివిఎంసికి నాలుగు కోట్ల రూపాయల నష్టం వస్తుంది. అన్నారు. దీని వల్ల కేవలం 40 లక్షల రూపాయల పన్ను మాత్రమే చేరుతుంది ప్రభుత్వానికి అని తెలిపారు. 81 వేల మంది ఎస్ ఎఫ్ టి ఉన్న వాళ్లకు లాభం చేకూరుతుందన్నారు. ఇవేమీ తెలియకుండా విపక్షాలు ఆందోళన చేస్తున్నాయని, ప్రభుత్వం వీటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఉరుకుటీ నారాయణ, విల్లురీ భాస్కర్ రావు, కందుల నాగరాజు పాల్గొన్నారు

## అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించినపుడే రైతుల సమస్యలు తెలుస్తాయి

### వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు సూచన

విశాఖపట్నం : వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు అందరూ కలిసి పని చేసినపుడే మంచి ఫలితాలు రాబట్టవచ్చని జిల్లా కలెక్టరు డా. ఎ.మల్లిఖార్జున సూచించారు. మంగళవారం కలెక్టరు వ్యవసాయ, హార్టికల్చర్, సెరికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులతో వారి సమస్యలు చర్చించి పరిష్కరించాలన్నారు. మీ పరిజ్ఞానాన్ని రైతులకు అందించి నాణ్యమైన అధిక ఫల సాయం పొందేందుకు ఉపయోగ పడాలన్నారు. మండలాలలో పర్యటించినపుడు అక్కడి ప్రత్యేక సమస్యలను బోర్డు సమావేశాలలో ప్రస్తావించా లన్నారు. బోర్డు సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలన్నారు. పాడేరు, నర్సీపట్నం ప్రాంతాలలో రైతులతో చర్చించాలన్నారు. గ్రామ సచివాలయాలలో ఈ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు మంచి సేవలను అందించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, నాణ్యత ప్రమాణాల పరీక్షలు నిర్వహించి తద్వారా రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించుటలో రైతు భరోసా కేంద్రాల పాత్ర ప్రధానమైనదని రైతు భరోసా కేంద్రాలలో పని చేసే సిబ్బందిని విత్తన విక్రయించే డీలర్లను అనుసంధానం చేసి తప్పని సరిగా వీరు విక్రయించు అన్ని రకాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లోని సీడ్ టెస్టింగ్ కిట్ ద్వారా మొలక శాతం పరీక్షించి నాణ్యత సరిపోయిన విత్తనాలనే రైతులకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఏజెన్సీ ప్రాంతాలలో వారపు సంతల్లో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మకుండా చర్యలు తీసుకోసుకొనే విధంగా రైతులలో అవగాహన కల్పించాలని ఆదేశించారు.



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటలపై యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పట్టు పరిశ్రమ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖలను కూడా సంక్షేమ పథకాలు రైతుల శ్రేయస్సు కోసం విరివిగా అందించవలెనని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను నిర్దేశిత కాలపరిమతిలోగా పరిష్కరించాలన్నారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు ఆ శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలు ప్రాజెక్టులు మొదలగు విషయాలను లక్ష్యాలు, సాధించినవి కలెక్టర్ కు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జెడి లీలావతి, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, సెరికల్చర్ శాఖల జె డి లు, హార్టికల్చర్ డి.డి తదితరులు పాల్గొన్నారు.

## పద్మనాభం మండలంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న

### పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విశాఖపట్నం, : భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పద్మనాభం మండలం రేవిడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల నుంచి మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాడు నేడు పనుల్లో భాగంగా రూ.69 లక్షల వ్యయంతో పనులు చేపట్టగా.. ఇందుకు సంబంధించి ప్రస్తుతం.. రూ.37 లక్షల వరకు పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. ఆసుపత్రి పనులకు సంబంధించి ఆర్ అండ్ బీ అధికారుల పనితీరు మరింత మెరుగు పరచుకోవాలని మంత్రి ఆదేశించారు. పీహెచ్ సీకి సబంధించి మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని డీఎమ్ హెచ్ఓను ఆదేశించారు. ఈక్రమంలో ఆసుపత్రిలో ఉన్న సదుపాయాలపై మంత్రి ఆరా తీశారు. స్టాఫ్ అందుబాటులో ఉండటం లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా పూర్తిస్థాయిలో స్టాఫ్ నిత్యం అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలో బెడ్లు, మందులు, మంచినీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలని ఎవరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు, వారి బంధువులు వేచి



ఉండేందుకు ఒక షెడ్డు నిర్మించాలని ఆదేశించారు. ఆసుపత్రి పనులపై రిపోర్ట్ ఇవ్వాలని ఆర్ అండ్ బీ అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం గ్రామ సచివాలయ ప్రారంభోత్సవానికి మంత్రి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, రెవెన్యూ అధికారులు, మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## కవి సమయం

### మానవ జీవితం

బహు అమూల్యం మానవ జీవితం
రెప్పపాటు జీవితం నీటిబుడగ సమానం
గడిచే ప్రతిరోజు మృత్యువుకు చేరువ
మన సత్కర్మలు, ధర్మాచరణే
పై జీవితానికి పునాది
మానవ సేవతో తరిస్తూ
మంచిని పెంచుతూ, సంపదలు పంచుతూ
నలుగురితో ఒక్కరిగా కలిసి మెలిసి జీవిస్తూ
శాశ్వతానందాన్ని అనుభవిస్తూ
జీవితానికి సార్థకత
చేకూర్చుకొనుటయే మన కర్తవ్యం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : శ్రావణ ; తిథి : తదియ సా.5.14; పుబ్బ ఉ.10.47; వ.సా.5.50ల 7.24.

బుధవారం 11-08-2021

**మేషం** : శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. విలువైన వస్తువుల కొనుగోళ్ళ నిమిత్రం ధనం బాగా ఖర్చు చేశారు. ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి అగ్రిమెంట్లు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. వాహనం ఇతరులకు ఇచ్చే విషయంలో లౌక్యంగా వ్యవహరించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

**వృషభం** :కుటుంబ విషయాలపై దృష్టి సారిస్తారు. మీ యత్నాలు గుంభనంగా సాగించాలి. ఇంటా ఒయటా మీ మాట చెల్లుబాటు కాగలదు. కొబ్బరి, పండ్లు, పువ్వులు, చిరు వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. ఓర్పుతో సర్దుకు పోవ టానికి యత్నించండి. బంధువులు, సోదరుల మధ్య ఆత్మీయతలు నెలకొంటారు.

**మిథునం** : బ్యాంకు డిపాజిట్లు దీర్ఘకాలిక పెట్టుబడులు అనుకూలం. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. స్థిరచరాస్తుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. కిట్టని వారు మిమ్ములను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తారు. విద్యార్థినులకు ప్రేమ వ్యవహారాల్లో చుక్కెదురవుతుంది.

**కర్కాటకం** : ఆర్థిక లావాదేవీలు, వ్యవహార ఒప్పందాల్లో జాగ్రత్త అవసరం. పోటీ పరీక్షలు, ఇంటర్వ్యూలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. బంధువులతో తగాదాలు ఒత్తిడి తప్పవు. ఒక స్థిరాస్తి కొనుగోలుకు అడ్డంకులు తొలగిపోగలవు. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం.

**సింహం** : తలపెట్టిన కార్యక్రమాలు ఆలస్యంగా సాగుతాయి. ఉద్యోగస్థులు సమర్థవంతంగా పనిచేసి అధికారులను మెప్పిస్తారు. విద్యార్థునలు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. కోర్టు వ్యవహారాలు మీరు కోరుకున్నట్లుగానే వాయిదా పడతాయి. నిరుద్యోగులు వచ్చిన అవకాశాన్ని తక్షణం వినియోగించుకోవాలి.

**కన్య** : పెద్దలుగా మీ బాధ్యతలు నిర్వహిస్తారు. సభలు, సమావేశాల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. ఎప్పటి నుంచి వాయిదా పడుతున్న పనులు పునఃప్రారంభమవుతాయి. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి. ఉద్యోగ రీత్యాదూర ప్రయాణాలు వాయిదా వేయాల్సి వస్తుంది.

**తుల** : కళల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాలు, రిజిస్ట్రేషన్లు అనుకూలిస్తాయి. ఉద్యోగస్తులకు బరువు బాధ్యతలు అధికం కావడంతో శ్రమాధిక్యత తప్పదు. ఆలయ సందర్శనాల్లో ఇబ్బందులు తప్పవు. ఏకాంతం కోసం చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి, తగు ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం** : ఆర్థిక విషయాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తారు. ఉపాధ్యాయులకు, మార్కెటింగ్ రంగాల వారికి ఒత్తిడి అధికమవుతుంది. కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు వాయిదా పడుతున్న పనులు పునః ప్రారంభం కాగలవు. మీ సమర్థత, నిజాయితీలకు ప్రభుత్వము నుంచి మంచి గుర్తిపు, రాణింపు లభిస్తుంది.

**ధనుస్సు** : వ్యాపారాల్లో ఆటుపోట్లను ధైర్యం ఎదుర్కొని లాభాల బాటలో నడిపిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారం లభిస్తుంది. విద్యార్థులకు వేడుకలకు వేడుకలలో హడావుడి, చురుకుతనం అధికమవుతాయి. వైద్యులకు శస్త్ర చికిత్సల సమయంలో ఓర్పు, ఏకాగ్రత చాలా ముఖ్యం. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది.


**మకరం** : దైవ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని అందరినీ ఆకట్టుకుంటారు. విద్యార్థులు బజారు తినుబండారాలు భుజించడం వల్ల అస్వస్థతకు లోనవుతారు. భార్యాభర్తల మధ్య అవగాహనాలోపం వల్ల సమస్యలు తలెత్తుతాయి. మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది.

**కుంభం** : కొబ్బరి, పండ్లు, పూల వ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. శత్రువుల సైతం ఆకట్టుకుని ముందుకు సాగుతారు. దూర ప్రయాణాల్లో వస్తువుల పట్ల మెళకువ అవసరం. రావలసిన బకాయిలు సకాలంలో అందిన ధనం ఏమాత్రం నిల్వ చేయలేరు. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

**మీనం** :దైవ పుణ్య కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిని ఇస్తాయి. రుణాలు తీర్చడానికి చేయు యత్నాలు వాయిదా పడతాయి. ముఖ్యమైన పనులు మీరే చేసుకోవడం మంచిది. రాజకీయాల్లోని వారికి శత్రువులు అధికమవుతున్నారని గమనించండి. బంధువుల రాక కొంత అసౌకర్యం కలిగిస్తుంది.

# సంపదలను ప్రసాదించే శివుడు

## సంకీర్తన



జీవితాన్ని ఆర్థిక పరిస్థితి ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అన్ని ఆనందాలు .. సంతోషాలు ఆర్థిక పరిస్థితితో ముడిపడి లేకపోయినా, అది చూపించే ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. అవసరాలు .. ఆపదల బారినుంచి బయట పడటానికి ఆర్థిక పరిస్థితి బాగా ఉండవలసిందే. అలాంటి పరిస్థితుల్లో ఆయురారోగ్యాలతో పాటు ప్రతి ఒక్కరూ సంపదలను కూడా భగవంతుడిని కోరుతుంటారు.

ఇలా సంపదలను పొందాలనుకున్నవాళ్లు, పరమశివుడిని పూజించడం వలన ఫలితం ఉంటుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. సోమవారం పరమ శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజున స్వామివారిని మారేడు దళాలతోను .. శంఖు పుష్పాలతోను పూజించడం వలన, సంపదలు చేకూరుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అందువలన ఆర్థికపరమైన ఇబ్బందుల నుంచి బయటపడాలనుకునేవాళ్లు, సదాశివుడిని ఈ రీతిగా పూజించి ఆయన అనుగ్రహాన్ని పొందవచ్చు.

### ఆపదలు తొలగించే అమ్మవారు

శక్తి స్వరూపిణి అయిన అమ్మవారు ఏ రూపంలో వున్నా .. ఏ పేరుతో కొలవబడుతూ వున్నా అమ్మ ప్రేమతో అనుగ్రహిస్తూనే ఉంటుంది. అందువల్లనే అమ్మవారి ఆలయాలు ఎక్కడ వున్నా భక్తులతో నిత్యం సందడిగా కనిపిస్తూనే ఉంటాయి. అమ్మవారిని పూజించడం వలన సౌభాగ్యం నిలుస్తుందని .. సంపదలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు.

ఇక అమ్మవారు ఆవిర్భవించిన 'అష్టమి' తిథి రోజున ఆ తల్లిని పూజించడం మరింత మంచిదని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అష్టమి రోజున అమ్మవారిని పూజించడం వలన .. పారాయణం చేయడం వలన .. ఆ రోజున 8 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించడం వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా అనారోగ్యాలు .. ఆపదలు దరిచేరవు. జీవితాన్ని అనారోగ్యాలు .. ఆపదలు అతలాకుతలం చేస్తుంటాయి. అందువలన అలాంటి గండాల బారిన పడకుండా అష్టమి రోజున అమ్మవారిని ఆరాధిస్తూ ఉండాలి.



## ఆచార్య ప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన

### 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : ఆంధ్ర యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ప్రసాద్ రెడ్డిని మంగళవారం మన 35 వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. తదనంతరం మన 35వ వార్డు అభివృద్ధి, మరియు సంక్షేమానికి మరింతగా కృషి చేయాలని, అహర్నిశలు కష్టపడి శ్రమ పడి మెరుగైన సేవలు ప్రజలకు అందించి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని వీసీ సూచించారు. అది విన్న మన కార్పొరేటర్ విల్లూరి భాస్కర రావు, మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు వైయస్.జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా స్వార్థం లేకుండా కృషి చేస్తున్నానని తెలిపారు.

## నింజాస్ అకాడమీకి పతకాలు పంట

### రెండు కాంస్యం, రెండు రజితం సాధించారన్న కోచ్ అబ్బు



విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) సౌత్ ఇండియన్ నేషనల్ కరాటే టోర్నమెంట్ లో నింజాస్ అకాడమీ కే చెందిన నలుగురు క్రీడా కారులు ఇద్దరు సిల్వర్ (రజతం), రెండు బ్రోన్జ్ (కాంస్యం) మెడల్స్ సాధించారని కోచ్ అబ్బు వెల్లడించారు.ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ టోర్నమెంట్ విశాఖ లో ఈనెల 8 , 9న మల్కాపురం స్టేడియం లో జరిగాయన్నారు.

ఈ సారి ఒలింపిక్ లో కూడా ఈ గేమ్ ను ప్రవేశ పెట్టారని అందుకే ఈసారి కరాటే లో మెడల్స్ రావడం కూడా కష్టమే అంటున్నారు. కొన్ని అసోసియేషన్స్ మాత్రమే వీటికి అనుమతి ఇస్తున్నారని కోచ్ తెలిపారు మొత్తం 9 మంది పాల్గొనగా 4 మెడల్స్ గెలు పొందారన్నారు. ఇపుడు స్పోర్ట్స్ కోటాలో ఏద యినా మెరిట్ సీట్స్ లభించే ఉద్యోగా వకాశాలు ఉంటున్నాయని ప్రతి తల్లి తండ్రులు పిల్లలకు ఎదో ఓ క్రీడ నేర్పించినట్లైనా ఇండియా ఒలింపిక్ లో మంచి మెడల్స్ సాధిస్తారు అని వెలగా నారాయణ రావు తెలిపారన్నారు. ఉచి తంగా ఇస్తున్నబాక్సింగ్ కరాటే వంటి ఈ క్రీడలను అందరు నేర్చుకోవాలని ఇదే అమెరికా వంటి అగ్ర దేశాలలో తల్లి తండ్రులు దగ్గర ఉంది వేలల్లో ఫీజు కట్టి మరీ స్పోర్ట్స్ గేమ్స్ నేర్పిస్తు న్నారని జగన్నాధం ఎన్నారై తెలిపారు.

## పెట్రోల్ బంకు లలో విజిలెన్స్ తనిఖీలు




గాజువాక : నగరంలోని పలు పెట్రోల్ బంక్ లలో విజిలెన్స్ అదికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు గాజువాక బీసీ రోడ్ వద్ద నున్న వెంకాయమ్మ హెచ్పి పెట్రోల్ బంక్ లో డీజిల్ పంప్ ట్యాంపరింగ్ జరిగిందంటూ ఒక వ్యక్తి విజిలెన్స్ అధికారులకు పిర్యాదుచేశారు. దీంతో స్పందించిన విజిలెన్స్ అండ్ ఎన్ పోర్స్ మెంట్ అదనపు ఎస్పి జి. స్వరూప రాణి మంగళవారం నేరుగా పెట్రోల్ బంక్ లో తనిఖీలు చేపట్టారు. అయితే బంక్ లో ఉన్న పంప్ లకు ఎటువంటి ట్యాపరింగ్ జరగలేదని గుర్తించిన అధి కారులు బంక్ లో పెట్రోల్, డీజిల్ శ్యాంపిల్స్ లను సేకరించి నాణ్యత పరీక్షలకు పంపిస్తామని అదనపు ఎస్పి జి. స్వరూప రాణి వెల్లడించారు. ఆమె వెంట విజిలెన్స్ అండ్ ఎన్ పోర్స్ మెంట్ సిఐ తిరుపతిరావు, సివిల్ సప్లయ్ ఎ.ఎస్.ఓ. మూర్తి, తూనికల శాఖ అధికారి రామచంద్రయ్య తదితరులు వున్నారు.

## పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాను

### ఏపి ట్రైకర్ చైర్మన్ శతక బుల్లిబాబు



పాడేరు : పార్టీ కార్యకర్తలకు సమస్య వచ్చిన, కష్టం కలిగిన, అండగా ఉంటానని,ఆంధ్రప్రదేశ్ ట్రైకార్ చైర్మన్ శతక బుల్లి బాబు అన్నారు. ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందిన వైసీపీ కార్యకర్త సాలేబు అప్పలరాజు కుటుంబ సభ్యులను మంగళవారం మండలంలోని కాడెలి గ్రామంలో సందర్శించి, అప్పలరాజు కుటుంబ సభ్యులకు పరామర్శించి ఓదార్చి సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పరంగా అప్పలరాజు కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.కార్యకర్తలకు ఎటువంటి సమస్య వచ్చిన మీకు అండగా నిలబడుతాన్నన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ట్రైకార్ చైర్మన్ వెంట పలువురు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## బోరు నీళ్లు పెట్రోలుతో కలుషితం



గోపాలపట్నం : 91వవార్డు పరిది రామక్రిష్ణ నగర్ పరిసర ప్రాంతాలలో ఈ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న హెచ్పి పెట్రోలు బంకువల్ల తాగు నీరు కలుషితమవుతుందని స్థానికులు ఎమ్మెల్యే గణబాబుకి ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే ప్రతి ఇంటినుంచి నీటి స్యాంపుల్ సేకరించి వివరాలు తెలియజేయాలని జివిఎంసి పొల్యూషన్ డిపార్టుమెంటు, అదేవిధంగా గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంటు ని ఆదేశించారు



### సముద్రంలో పడి

## వస్త్ర వ్యాపారి మృతి



భీమునిపట్నం : జీవిఎంసి రెండవ వార్డ్ తగరపువలస మెయిన్‌రోడ్ లో ఉన్న జశ్వంత్ రెడీమేడ్ వస్త్ర దుకాణం ఓనరు కటకం మల్లి బాబు, 50 సంవత్సరాల నాలుగవ వార్డ్ చేపలుప్పాడ వద్ద సము ద్రంలో దూకి ఆత్మ హత్య చేసుకున్నారని భీమిలి సబ్ ఇన్స్పెక్టర్ పి.రాంబాబు తెలి పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ



మూలగాడ : నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగ గల సామాజిక భవనం వద్ద మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, వార్డు యూసీడీ సీఓ మహాదేవి తదితరులు పాల్గొని సుమారు వంద మంది నిరుపేద మహిళలకు సరుకుల కిట్‌లు పంపిణీ చేశారు.

### 12న కొయ్యూరులో

## రక్తదాన శిబిరం

కొయ్యూరు : ఈ నెల 12వ తేదీన స్థానిక జిల్లా పరిషత్ గెస్ట్‌హౌస్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు మేమున్నాము కోవిడ్ సేవా సంఘం, ఏఎస్.రాజా వాలంటీర్ బ్లడ్ బ్యాంక్ ప్రతి నిధులు తెలిపారు. ఈ శిబిరం ఏర్పాటుపై జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్, కొయ్యూరు జెడ్పీటీసీ మాజీ సభ్యులు శ్రీరామ్మూర్తి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సోమశేఖర్, చిరంజీవి, శివ, దారబాబు పాల్గొన్నారు.

### ఎస్ఐ నాగేంద్ర కృష్ణ సిబ్బందితో కలిసి

## 10 లీటర్ల నాటుసారా స్వాధీనం



పెద్దాపురం : ప్రోహిబిషన్ ఎక్సైజ్ నేరములపై సిఐ జి.వెంకటలక్ష్మి అయినా నాకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ మరియు సిబ్బందితో కలిసి దాడులు చేయగా గండేపల్లి మండలము మురారి గ్రామంలో చిట్టిమాని వీర వెంకటరావు అనే వ్యక్తిని 10లీ॥ నాటు సారా తో అరెస్టు చేసి 10లీ నాటు సారా స్వాధీనం చేసుకోవడమైనది.

పెద్దాపురం మండలం పులిమెరు, మర్లోవ గ్రామలలో 3800లీ బెల్లపు ఊట, రంగంపేట మండలం వడిసలేరు, ముకుందవరం గ్రామాలలో 3400 లీ॥ బెల్లపు ఊట ధ్వంసం చేయడమైనది.

పెద్దాపురం మండ లం మర్లోవా గ్రామం లో ఒకరు, గండేపల్లి మండలం రామయ్యపాలెం గ్రామం లో ఇద్దరు, అబ్స్కాండెడ్ నిందుతలను అరెస్టు చేసి, మొత్తం నలుగురుని కోర్టున హాజరు పరిచి రిమాండ్ కు తరిలించడమైనది.

## ఘనంగా బొద్దపు శ్రీనువాస్ జన్మదిన వేడుకులు



పరవాడ : పరవాడ మండలము ఇ.బోనంగి పంచాయితీ సర్పంచ్ బొద్దపుశ్రీనువాస్ కాసులు జన్మదిన వేడుకులు మంగళవారము అయన స్వగ్రహములో బివిపి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి.ముందుగా కార్యకర్తలు మరియు బివిపి యూత్ సభ్యులు మద్యకేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరము మేడిశెట్టి బాలాజీ నాయుడు, చందకఅశోక్, బాలాజీ, శ్రీను, జగదీష్, రమేష్ ,ప్రసాద్ తథితర్లు బొద్దపు శ్రీనువాస్ కాసులుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియపరిచారు. అనంతరము వీళ్ళ మాట్లాడుతూ ఇ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనువాస్ కాసులు ఇటువంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరిపికోవాలి అని రానున్న రోజుల్లో మరిన్నీ ఉన్నత పదవులును పొందాలిఅని అకాక్షించారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు మరియు బివిపి యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



### ఈ నెల 12న బీజేపీ

## గిరిజన మోర్చ జిల్లా కార్యవర్గ సమావేశం

### అరకు పార్లమెంట్ ఎస్టీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు



కొయ్యూరు : రంప చోడవరం అసెంబ్లీ హెడ్ క్వార్టర్స్‌లో ఈ నెల 12న బిజెపి గిరిజన మోర్చ జిల్లా కార్యవర్గ సమావేశం జరగనుందని బిజెపి అరకు పార్లమెంట్ ఎస్టీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకులగాంధీ, బిజెపి ఎస్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు కురసా ఉమామహేశ్వరరావు, అరకు జిల్లా అధ్యక్షులు పాంగి రాజారావు, బిజెపి సీనియర్ నాయకులు కురసా రామారావు, బిజెపి జాతీయ గిరిజన మోర్చ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే కెకెవిఎస్ఎన్.రెడ్డిలు హాజరవుతారన్నారు. కావున ఈ సమావేశానికి బిజెపి కార్యకర్తలు, గిరిజన మోర్చ మండలాధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

## విఆర్ఎమ్‌డిఎ ప్లాన్ పై అవగాహన



అచ్యుతాపురం : విఆర్ ఎమ్ డిఎ ప్లాన్ పై వుడా అధికారులు మూర్తిశ్రీ, ఉమా మహేశ్వరరావు మండలంలో గల అధికారులకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాయి, ఎంపీడీఓ కృష్ణ, డిటి లక్ష్మయ, విఆర్ఒ, కార్యదర్శిలు, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

## నల్లంకిలో ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలు

గొలుగొండ : ఆదివాసీ హక్కుల సాధన సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు గొలుగొండ మండలం నల్లంకి గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు ఒ.సన్యాసిరావు మాట్లాడుతూ ఎందరో గిరిజన పోరాట యోధులు కృషి ఫలితంగా నేటి గిరిజనులకు స్వేచ్ఛగా కొంతైనా ఉంటున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. నాన్ షెడ్యూల్ ఏరియా గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని, తద్వారా నాన్ షెడ్యూల్ గిరిజన గ్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మండల సంఘం అధ్యక్షులు బిడిజన మల్లేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన సబ్ ప్లాన్ నిధులు పక్కదారి కాకుండా గిరిజనులకే ఖర్చు చేయాలన్నారు. కె.కన్నంరెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం కేజిహెచ్‌లో ఎస్టీసెల్ నాన్ షెడ్యూల్ గిరిజనులకు కూడా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం గ్రామంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు లక్ష్మణరావు, భాస్కరరావు, కళ్యాణ్, లోవరాజు, నాగరాజు, పోతురాజు, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.



వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో

# అడ్మిషన్‌లు యథావిధిగా కొనసాగించాలి

- ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యూలర్ ఉపసంహరించుకోవాలి
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన




పెద్దాపురం : ఎయిడెడ్ కళాశాలల్లో డిగ్రీ అడ్మిషన్‌లు నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యూలర్‌ను, ఎయిడెడ్ కళాశాలలకు ఎయిడ్ ఆపేస్తూ విడుదల చేసిన సర్క్యూలర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి సమాఖ్య(ఎస్.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో పెద్దాపురం మహారాణి కళాశాల ఎదుట ప్లెకార్డులతో ధర్నా నిర్వహించారు. జివో నెంబర్ 35 రద్దు చేయాలని, ఎయిడ్ కళాశాలలను రక్షించాలని, అడ్మిషన్‌లకు అనుమతి ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ ధర్నానుద్దేశించి ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి టి.రాజా మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని అన్నారు. ఎయిడ్ విద్యా సంస్థలకు ఎయిడ్ ను ఆపేస్తూ ప్రభుత్వం సర్క్యూలర్ ఇవ్వడం చాలా దుర్మార్గమని అన్నారు. అనేక మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థానాల్లో ఎయిడెడ్ కళాశాల, పాఠశాలలు నిలిపాయని అన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను కాపాడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల తరువాత ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే పనిలో పడ్డారని అన్నారు. జివో నెంబర్ 35 ద్వారా నాడు ఎయిడెడ్ విద్యా సంస్థల్లో టీచర్, లెక్చరర్ పోస్టులు భర్తీ కాకుండా చంద్రబాబు చేస్తే, అసలు అడ్మిషన్‌లే జరపవద్దంటూ జగన్ మోహన్ రెడ్డి జివో ఇచ్చారని అన్నారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను కాపాడుకోవాల్సిన భాద్యత మనందరిపై ఉందని అన్నారు. రాష్ట్రవ్యాపిత ఉద్యమానికి ఎస్.ఎఫ్.ఐ సన్నద్ధం అవుతుందని తెలిపారు. అన్ని రంగాల విద్యార్థులను, మేధావులను, వివిధ తరగతుల ప్రజలను కలుపుకోని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి వీరబాబు, లలిత, కె. అమృత, దుర్గా ప్రసాద్, డి.శ్యామ్ కుమార్, ఇ.ఉపేంద్ర, వినయ్, కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 48లి [illegible]





అనంతగిరి : అనంతగిరి మండలంలో హైస్కూల్ శాఖ అధ్యక్షులు టి.బాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్ ఎస్.పరమేష్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. యుటిఎఫ్ జిల్లా సహధ్యాక్షులు ఎస్.రాంబాబు యుటిఎఫ్ పథకాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా సహధ్యక్షులు మాట్లాడుతూ అధ్యయనం, అధ్యపనం, సామాజిక స్పృహ అత్యుత్తమ భావాలతో యుటిఎఫ్ ఏర్పడింది. అవినీతికి వ్యతిరేకంగా ఉపాధ్యాయులా సమస్యల పట్ల విద్యారంగా సమస్యల పట్ల రాజీ లేని పోరాటాని యుటిఎఫ్ అప్రతిహతంగా కొనసాగుతుందని, యుటిఎఫ్ సభ్యులుగా మరిన్ని మంచి కార్యక్రమాలను, పోరాటాలను కొనసాగాలని పిలుపు నిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలతో పాటు అనేక సామాజిక సమస్యలపై యుటిఎఫ్ ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు టి.విజయ్, కె.వెంకట నారాయణ, జె.దేముడు టి.రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా

# నవోదయ ప్రవేశ పరీక్ష జరిగాలి

మాకవరపాలెం : ఈ నెల 11న నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్ష పారదర్శకంగా జరిగేలా చూడాలని విద్యాశాఖ అధికారులను విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంఇఒ సాయిశైలజ వినతిపత్రం అందించారు. పరీక్షా కేంద్రాల్లో ఉండే ఇన్విజిలేటర్లు కొందరు విద్యార్థులను పాస్ చేయించేందుకు సహకరిస్తున్నారని ఆరోపించారు.

దీనివల్ల బాగా చదువుకున్న వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇన్విజిలేటర్ల సహకారం లేకుండా పరీక్ష సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

## వైసీపీ స్వార్ధపూరితమైన చర్యల వల్లే

# కేంద్ర మంత్రి పర్యటన నిరాశ కల్పించింది

### కొయ్యూరు బీజేపీ మండలాధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు



కొయ్యూరు : వైసిపి నాయకుల స్వార్ధపూరితమైన చర్యల వలే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన నిరాశ కల్పించడం జరిగిందని కొయ్యూరు బిజెపి మండలాధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు అన్నారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ కేడిపేట అల్లూరి సీతారామరాజు పార్కులో జరిగిన బహిరంగ సభకు హాజరు కాకుండా కేవలం నివాళ్లు అర్పించి వెళ్లిపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తపరుస్తున్న సందర్భంగలో మంగళవారం ఆయన వివరణ ఇచ్చారు. దివాళా తీసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని, రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివరించడం కోసం కొంత నిధులు సమ కూర్చుకోవడం కోసం సుమారు 2 గంటల పాటు ఆలస్యం చేయడం వల్లే ఈ పర్యటన నుండి ఆమె వెనుదిరగాల్సి వచ్చిందన్నారు. వాస్తవానికి రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి లోకులగాంధీ స్వగ్రామం శరభన్నపాలెం కూడా సందర్శించాలని ఆమె కోరుకున్నప్పటికీ సమయ భావం వలన వెళ్లలేక సాటి మహిళా ఎంపి గొడ్డేటి మాధవి కోరిక మేరకు కేడి పేటలో గల ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి అటు నుంచి సాయంత్రం 4 గంటలకు ఫ్లైట్‌లో ఢిల్లి వెళ్లిపోయారని, ప్రజలకు జరిగిన అసౌకర్యానికి చింతిస్తు న్నామని తెలిపారు.



ఉత్తరాంధ్ర ఎమ్ఎల్‌సి పివిఎన్ మాధవ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేసిన బిజెపి కిసాన్ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి కెవిరమణ, వంద సంవత్సరాలు ఆయురారోగ్య ఐశ్వర్యంతో, మరిన్ని ఉన్నత పదవులు తో ప్రజా సేవ చేయాలి అని ఆశీర్వాదం తెలియచేసిన కెవరమణ. ఈ కార్యక్రమానికి ప్రకాష్ రెడ్డి సుబ్రహ్మణ్యం ధనుం జయినాయుడు శ్రీరామ్మూర్తి వెంకటేశ్వర్లు 100 ల కొలది కార్యకర్తలు హాజరైనారు.

# యూజీసీ సదస్సులో పాల్గొన్న ఏయూ వీసీ



యూజీసీ సదస్సులో పాల్గొన్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఆంధ్రాయూనివర్శిటీ : జాతీయ విద్యా విధానంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్, కేంద్ర విద్యాశాఖ, ఐటి మంత్రిత్వ వాఖ సంయుక్తంగా నిర్వహించిన 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్' సదస్సులో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి వర్చువల్ విధానంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటి శాఖ మంత్రి ఆశ్విన్ వైష్ణావ్ ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. విద్యా రంగానికి కోవిడ్ సమయంలో ఎదురైన సవాళ్లు, వాటిని అధిగమించిన విధానం, సాంకేతికతను ఉపయుక్తంగా నిలుపుకోవడం వంటి అంశాలపై నిపుణులు చర్చించారు.

ఈ కార్యక్రమంలో యూజీసీ, ఏఐసిటిఇ, కేంద్ర విద్యా ల ఉన్నతాధికారులు, వివిధ విశ్వవిద్యాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ చదివించండి - ఉద్యోగం పొందండి



కేజీబీవి లో అవగాహన కార్యక్రమం నిర్వహించిన దృశ్యం




కాలేజీ వద్ద పోస్టర్ చూపించి ప్రచారం చేశారు ప్రిన్సిపల్, ఇతర సిబ్బంది

విశాఖపట్నం జిల్లా (నర్సీపట్నం) : చదువు తరువాత ఉద్యోగం అనేది విద్యార్థుల యొక్క ముఖ్య ఉద్దేశ్యమే అయితే..పదవ తరగతి చదివిన విద్యార్థులు పాలిటెక్నిక్ చదువు ఎన్నుకుంటే ఆ లక్ష్యం చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుందని పోలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ టి విక్టర్ పాల్ తెలిపారు. పాలిటెక్నిక్ చదివిన ప్రతి విద్యార్థికి ఉద్యోగానికి వెళ్లాలా లేక ఉన్నత చదువులు వెళ్లాలా అనే నిర్ణయం వాళ్ళ చేతుల్లోనే ఉంటుందన్నారు.మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో పాలీసెట్ సంబంధించిన ముఖ్య విషయాలు తెలియ చేశారు. పాలీసెట్ -2021ప్రవేశ పరీక్ష తేదీ 01.09.2021 నాడు నర్సీపట్నం లో 12 కేంద్రాలలో నిర్వహించబడును. ఆగస్టు 13.08.2021 నమోదు చేసుకొనుటకు చివరి తేది.పదో తరగతి పాస్ అయినా విద్యార్థులు అందరు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలి. ఆన్లైన్ కోచింగ్ కొరకు డాక్టర్ చిట్ల రాజు సీనియర్ లెక్చరర్ ని 7036926589 వాట్సాప్ ద్వారా సంప్రదించాలని

కోఆర్డినేటర్/ప్రిన్సిపాల్

గవర్నమెంట్ పాలిటెక్నిక్ నర్సీపట్నం వారు కోరుతున్నారు.

## గిరిజన చట్టాలకు లోబడే

# జాతీయ రహదారులు నిర్మాణం చేయాలి

### ఏజెన్సీ చట్టాలకు లోబడి జాతీయ రహదారి నిర్మాణం జరగాలి



పాడేరు : విజయనగరం నుంచి విశాఖ ఏజెన్సీ మీదుగా రాజమండ్రి వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి (ఎన్ హెచ్516) నిర్మాణ పనులను ఏజెన్సీ చట్టాలు, నిబంధనలకు లోబడి మాత్రమే రోడ్ల నిర్మాణం జరిపించాలని, చట్టాలను గౌరవించకుండా పనులు చేయాకూడదని, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు పి. రంజిత్ భాషా ఆదివాసీలు ఆధారపడ్డ కొద్దిపాటి వ్యవసాయ యోగ్యమైన భూములపై నుండి కాకుండా ఆర్ అండ్ బి రోడ్డునే జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని గతంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీకాంతిలాల్ దండే కి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర లేఖలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి రోనంకీ గోపాలకృష్ణ గార్లను జాతీయ రహదారి ఎన్ హెచ్ 516 నిర్మాణంలో ఆదివాసి చట్టాలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారని బాధితులకు ఒక్క రూపాయి కూడా నష్ట పరిహారం చెల్లించకుండా, గ్రామ సభ తీర్మానాలు చేయకుండా, తీర్మానాలు చేసిన వాటికి గౌరవించకుండా రోడ్డు పనులు, మెటల్ క్వారీలు, మట్టితవ్వకాలు మొదలు పెట్టేసారు. అంతేకాకుండా అరకు వేలి మండలంలో శ్రీకాకుళం ప్రాంతం నుంచి వలస వచ్చిన "కాపులు" తాము "ఎస్టీ కొండ కాపు"లమంటు తమ పేర్లు అక్రమ మార్గల ద్వారా "వెబ్ లెండ్"లో నమోదు చేయించుకుని నష్టపరిహారం కాజేయాలని చూస్తున్నారని రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్, 1/70 బదలాయింపు నిషేధ చట్టం, పేసా, అటవీ హక్కుల చట్టం వంటి చట్టాలను పరిగణలోకి తీసుకొని బై పాస్ లు, మెటల్ క్వారీలు, గ్రావెల్ క్వారీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తక్షణమే గ్రామసభలు నిర్వహించి ఆదివాసుల అభీష్టానికి వ్యతిరేకంగా, ఆదివాసి ఇతరులు వ్యాపార సముదాయాలను కాపాడడానికి అరకు వేలి, హుకుంపేట మొదలైన ప్రాంతాల్లో ఆదివాసుల పంట భూములపై నిర్మించతలపెట్టిన "బైపాస్ రోడ్లు" పూర్తిగా రద్దు చేయాలి. అలాగే ఆదివాసులకు నష్ట పరిహారం చెల్లించకుండా జరుగుతున్న రోడ్డు పనులు తక్షణమే నిలుపుదల చేయాలన్నారు.

# రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



దేవరాపల్లి : రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేసి రైతులకు న్యాయం చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం రైతు సదస్సు నిర్వహించారు. అనంతరం రైతుల సమస్యలపై కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గరికిన రాజు మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలు విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, కౌలు రైతుల రక్షణ కోసం చట్టం తేవాలని, భూ యజమాని ఆమోదంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాల మంజూరు చేయాలని, గ్రోయిన్ మరమ్మతులు చేపట్టే పంటలకు సాగునీరు అందించాలని చెరుకు రైతులు బకాయిలు తక్షణమే చెల్లించాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు పెంచి అందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. చట్టంలో పొందుపరిచిన విధముగా పేమెంట్లు వెంటనే చెల్లించాలన్నారు. పంటలకు మద్దతు ధర గ్యారెంటీ చట్టం తేవాలని, రైతు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజన్న దొర బాబు జిల్లా సమితి సభ్యులు వేముల కన్నబాబు ఎస్ సురేష్ ఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా సత్తెన్న 131వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా కోరిన కోర్కెలు తీర్చే శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి 131వ ఆవిర్భావ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

ముఖ్యంగా శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారు 1891( ఆగస్టు 6న) శ్రావణ శుద్ధ విదియ రోజున అంకుడు చెట్టు కింద వెలిసినట్లు ఆలయ చరిత్ర చెప్తుంది.అప్పటి నుంచి ప్రతియేటా శ్రావణ శుద్ధ పాడ్యమి నుంచి విదియ వరకు శ్రీ స్వామివారి ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఆవిర్భావ వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రావణ శుద్ధ విదియ శ్రీ స్వామివారి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా వేద పండితులు.ఆలయ ప్రధాన అర్చకులు కోట. శ్రీనివాస్,ఇంద్రగంటి. నరసింహమూర్తి ఆధ్వర్యంలో తెల్లవారు జామున రెండు గంటలకు శ్రీ స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి అభ్యంగన స్నాన మాచరింజేసి మూల విరాట్ లకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం,లక్ష తులసిధాత్రి,వివిధ సుగంధభరితమైన పుష్పాలతో విశేష పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీ స్వామి,అమ్మవార్లకు నూతన వస్త్రములు దరింప జేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధ భరితమైన పుష్పాలతో అలంకరించి అని వేటి మండపం లో ఉన్న సింహాసనంపై ఆశీనులు గావించి నవగ్రహ జపములు, సూర్య నమస్కారములు, చండీ హెూమం,ఆయుష్ హెూమం లను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అనంతరం 11:00 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం గావించారు. తదనంతరం11:30 నిమిషములకు శ్రీ స్వామి అమ్మవార్లను వెండి రథంపై ఆశీనులు గావించి తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు.

ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణం అంతా వివిధ రకములైన సుగంధ భరితమైన పుష్పములతో సర్వాంగ సుందరంగా ఆలయ ప్రాంగణం ను అలంకరించారు. అలంకరణలో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లను వివిధ రకములైన పుష్పములతో చేసిన కటౌట్ భక్తులకు ఆకర్షణీయంగా నిలిచింది.శ్రీ స్వామివారి అవిర్భావ దినోత్సవం సందర్భంగా రత్నగిరి పై వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ స్వామివారి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉదయం నుండి శ్రీ స్వామివారి దర్శనార్థం కోసం భక్తులు,గ్రామస్థులు అధిక సంఖ్యలో రత్నగిరికి విచ్చేసి శ్రీ స్వామివార్ని కోవిడ్ నిబంధనలు పాటిస్తూ దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు,ఆలయ అర్చకులు,వ్రత పురోహితులు దేవస్థానం చైర్మన్ ఐ.వి. రోహిత్,దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి. త్రినాధరావు,పాలక మండలి సభ్యులు,ఆలయ ఏఈవో దామెర కృష్ణారావు,పిఆర్వో కొండలరావు,సూపరింటెండెంట్లు బలువు.సత్య శ్రీనివాస్. సుబ్రహ్మణ్యం మరియు దేవస్థానం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు భూములు పంచాలని ధర్నా



మాకవరపాలెం : మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నెంబరు 1655లో అన్యాక్రాంతంగా సాగు చేస్తున్న కట్టా రామారావు దగ్గర ఉన్న 50 ఎకరాల బంజరు భూమిని భూమి లేని నిరుపేదలకు పంచాలని, జి.కోడూరు గ్రామస్థుల పేరున ఉన్న డిఫారం పట్టాలు, పట్టాదారులకు అప్పగించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మాకవరపాలెం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రాణీఅమ్మాజికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ మండలంలో రాచపల్లి రెవెన్యూ 737 సర్వే నెంబరు 1655లో బంజరు భూమిలో కట్టా రామారావు అనే వ్యాపారి చేతుల్లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని భూమి లేని నిరుపేదలకు ఇవ్వాలన్నారు. అలాగే సదరు మండలంలో ఉన్న జి.కోడూరు రెవెన్యూలో గతంలో సర్వే డిపార్టుమెంట్‌లో పని చేసి రిటైర్డు అయిన వంతూరుపల్లి చిదంబరం, ఆయన బంధువులు అయిన అడివి సిద్దసందేశ్వరరావు, అలాగే వంగూరి సుభద్రాదేవి, చింతాపతి కమల వగైరాలు పేర్ల మీద ఉన్న డిఫారం పట్టాలు సుమారు 75 ఎకరాల భూములను రద్దు చేసి కోడూరు రెవెన్యూలో ఉన్న పేదవారికి పంచాలని, 332 సర్వే నెంబరులో సుమారు 50 ఎకరాలు భూములకు లోకల్ వారికి పట్టాలు ఇచ్చి నేటికి ఆ భూమి చూపించలేదన్నారు.

వెంటనే భూమి సర్వే చేసి పట్టాలు ఇచ్చిన వారికి అప్పజెప్పాలని, చిదంబరం కుటుంబాలకు ఇచ్చిన 75 ఎకరాల డిఫారం పట్టా భూముల యొక్క సర్వే నెంబరులో 770/2, 771/2, 774/3, 773/1ఎ, 774/1, 775/1, 787/3, 776/1, 789/1, 789/2, 790, 791/1 సర్వే నెంబర్లకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలు రద్దు చేసి మండలంలో ఉన్న ఎస్టీ, ఎస్సీ, బిసి వెనుకబడిన కులాలలో ఉన్న పేదవారికి పంచిపెట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శివలంక కొండలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.తాతబ్బాయి, నిరుపేదలు పాల్గొన్నారు.

# నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలి

## రెక్టార్ ఆచార్య కె.సమత




శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉద్యోగులు నాయకత్వ లక్షనాలను అందిపుచ్చుకోవాలని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సూచించారు. మంగళవారం ఉదయం ఏయూ హెచ్ఆర్‌డిసి కేంద్రంలో బోధనేతర సిబ్బందికి నిర్వహిస్తున్న వారం రోజుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భావ ప్రసార నైపుణ్యం, పనిచేసే ప్రదేశంలో విభిన్న అంశాలపై అవగాహన, సాంకేతికతను మేళవిస్తూ సత్వర సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా బోధనేతర సిబ్బందిని తీర్చిదిద్దడానికి నిరంతరం విశ్వవిద్యాలయం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వారం రోజుల శిక్షణలో నేర్చుకున్న నూతన అంశాలను, నైపుణ్యాలను తమ నిత్య విధుల్లో ఆచరణలో చూపుతూ సమర్ధవంతంగా సేవలు అందించడం ఎంతో అవసరమన్నారు. ఏయూ యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భాను కుమార్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని దరిచేరనివ్వకుండా విధి నిర్వహణ చేయడం ఎంతో ప్రధానమన్నారు. దీనికి యోగా ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. వ్యక్తిత్వ వికాసం, జీవన శైలిని క్రమబద్దీకరించుకోవడం ఎంతో అవసరమన్నారు.కేంద్రం సంచాలకులు ఆచార్య ఎన్.ఏ.డి పాల్ మాట్లాడుతూ వారం రోజుల శిక్షణలో భాగంగా ఉద్యోగులకు విధినిర్వహణ, సమన్వయం చేసుకోవడం, పరిసరాలకు అనుగుణంగా మనం మార్పు చెందడం, వ్యవస్థ, సంస్థ ప్రగతికి పనిచేయడం, నాయకత్వం పెంపొందించుకోవడం వంటి విభిన్న అంశాలను స్పృశిస్తూ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో 43 మంది బోధనేతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# దేవరాపల్లిలో భారీ వర్షం



దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎండలు తీవ్రంగా కాసే సమయంలో ఒక్కసారి వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ప్రజలు ఉక్కపోత నుండి సేద తీరారు. ఖరీఫ్ సీజన్లో నారుమళ్లు ఎదిగే సమయంలో వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో 18 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. రైవాడ జలాశయం నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 105.40 లకు చేరుకుంది. ఇదిలా ఉండగా ఎడమ కాలువకు 100 క్యూసెక్కులు, కుడి కాలువకు 50, జీవీఎంసీ కి 50 క్యూసెక్కులు చప్పున 200 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు.

# వైఎస్సార్ నేతన్న నేస్తం జమ



కాకినాడ : తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా మూడో విడతలో రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధిదారుల ఖాతాల్లో బటన్ నొక్కి ఆర్థిక సహాయం మొత్తాన్ని జమచేసే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు. చేనేత, జౌళి, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తదితరులు పాల్గొన్న ఈకార్యక్రమానికి కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్ నుంచి కలెక్టర్ సి.హరికిరణ్, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, జాయింట్ కలెక్టర్ (ఆసరా, సంక్షేమం) జి.రాజకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల లబ్ధిదారులు హాజరయ్యారు. కార్యక్రమం సందర్భంగా జిల్లాలో వైఎస్సార్ నేతన్ననేస్తం పథకం అమలు వివరాలను కలెక్టర్ హరికిరణ్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. జిల్లాలో పథకం ద్వారా 2021-22లో 7,092 మంది లబ్ధిదారులకు రూ.17,02,08,000 మేర లబ్ధి చేకూరినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో...

జిల్లా చేనేత,జౌళిశాఖ సహాయ సంచాలకులు ఎన్ఎస్ కృపావరం,ఎస్ఈ పీఆర్‌బీ ఎస్.రవీంద్ర, అధికారులు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు హాజరయ్యారు.

# కరోనా థర్డ్ వేవ్ వచ్చినా

# ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళిక

*- గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో పీడియాట్రిక్ వార్డు*

*- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని*



గుడివాడ : కరోనా థర్డ్ వేవ్ వచ్చినా ధీటుగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చెప్పారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో థర్డ్ వేవ్ నేపథ్యంలో సిద్ధం చేస్తున్న పీడియాట్రిక్ వార్డు, కోవిడ్ కేంద్రంలో కరోనా రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై మంత్రి కొడాలి నాని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ కరోనా థర్డ్ ను దృష్టిలో పెట్టుకుని గుడివాడ ఏరియా ప్రభుత్వాసుపత్రిలో పీడియాట్రిక్ వార్డును ఏర్పాటు చేస్తున్నామన్నారు. మొత్తం 20 ఆక్సిజన్ బెడ్స్ అందుబాటులో ఉంటాయన్నారు. వీటిలో 10 ఐసీయూ బెడ్స్ ఉంటాయని తెలిపారు. ప్రభుత్వాసుపత్రికి అదామా కంపెనీ ఆక్సిజన్ గ్యాస్ జనరేట్ ప్లాంట్ ను అందజేసిందన్నారు. టెక్నీషియన్లు ప్లాంట్ ను బిగించే పనిలో ఉన్నారని చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా నిరంతరాయంగా ఆక్సిజన్ బెడ్స్ పై చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన ఆక్సిజన్‌ను అందజేయవచ్చన్నారు. ఈ ప్లాంట్ తో పాటు ప్రభుత్వం కూడా మరో ఆక్సిజన్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. కరోనా సెకండ్ వేవ్ ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో కోవిడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 200 మందికి పైగా కోవిడ్ రోగులకు వైద్యం అందించామని, ప్రస్తుతం ఈ కేంద్రంలో ఏడుగురు కరోనా వైరస్ సోకిన రోగులు చికిత్స పొందుతున్నారని చెప్పారు. కోవిడ్ కేసులు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో ప్రజలు మాస్కులను ధరించి మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కూడా నిబంధనలను కొద్దికొద్దిగా సడలిస్తూ వస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఇదిలా ఉండగా థర్డ్ వేవ్ ను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు 462 ప్రైవేట్ ఆసుపత్రులను కూడా ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చాలా వరకు 50 నుండి 100 పడకల లోపు ఆసుపత్రులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. 100 పడకల కంటే ఎక్కువగా 65 ఆసుపత్రులు ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డీ టైప్ ఆక్సిజన్ సిలిండర్లను సిద్ధం చేసుకోవాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలను జారీ చేసిందన్నారు. అలాగే ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించామన్నారు. సాధారణ పడకలతో పాటు ఆక్సిజన్ పడకలు కూడా సిద్ధమవుతున్నాయన్నారు. ఎటువంటి సమయంలో రోగులు వచ్చినా వారికి వైద్య సేవలందించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఈ నెలాఖరు నాటికి అన్ని ఆసుపత్రుల్లో పూర్తిస్థాయి వైద్య సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. నర్సింగ్, పారామెడికల్, ఫార్మసీ, ఎంబీబీఎస్, పీజీ చదువుతున్న వైద్య విద్యార్థులను కూడా కోవిడ్ సేవల్లో వినియోగించుకోవాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి కొడాలి నాని చెప్పారు.

## జగనన్న గృహ నిర్మాణాల గ్రౌండింగ్ పనులను

# ఈ నెల 15 లోగా వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం : నవరత్నాలు పేదలందరికి ఇళ్లు, జగనన్న గృహనిర్మాణాల గ్రౌండింగ్ పనులను ఈ నెల 15 లోగా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశమందిరంలో గృహ నిర్మాణ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణ పథకానికి సంబందించి పనులను అలసత్వం లేకుండా సంబందిత మండల అధికారులు అంకిత భావంతో పని చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నవరత్నాలు - పేదలందరికి ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వై ఎస్ ఆర్ అర్బన్ ఫేజ్ - 1 గృహ నిర్మాణాలకు సంబందించి లే అవుట్ లు,

గ్రౌండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రతి మంగళవారం హౌసింగ్ పనులకు సంబందించిన పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని ఎప్పటి కప్పుడు జరుగుతున్న అభివృద్ధి తనకు వివరించాలన్నారు. లే అవుట్ లలో బేస్ మెంట్ లెవెలింగ్, అంతర్గత రోడ్లు, అప్రోచ్ రోడ్లు, విద్యుత్తు, బోర్ వెల్స్, నీటి సరఫరా

పనులను వేగవంతం చేయాలన్నారు. సిమెంట్, స్టీల్, ఇసుక మెటీరియల్ ను అందుబాటులో ఉంచాలన్నారు.

హౌసింగ్ పిడి ఎం .శ్రీనివాసరావు, మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికి ఇళ్లు మొదటి దశలో భాగంగా జిల్లాలో 36.932 గృహాలు లక్ష్యం కాగా, 33.202 గృహాలు గ్రౌండింగ్ అయి 90 శాతం తో రాష్ట్రంలో విశాఖ జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, పంచాయితీ రాజ్, ఆర్ డబ్ల్యు ఎస్, ఆర్ అండ్ బి , ట్రాన్స్ కో , డ్వామా, జి.వి.ఎం.సి, హౌసింగ్ శాఖల అధికారులు హాజరైయారు.

# శిధిలమైన డ్రైనేజిలను పునర్నిర్మించండి

### - జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం :- శిధిలమైన డ్రైనేజిలను పునర్నించాలని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జివిఎంసి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నాలుగవ జోన్ 37వ వార్డు పరిధిలో గొల్లవీధి, ఆశిపాప వీధి, కొత్త రెల్లి వీధి, జబ్బర్ తోట తదితర ప్రాంతాలలో జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన, వార్డు కార్పొరేటర్ చెన్న జానకిరామ్ తో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ సంయుక్తంగా మాట్లాడుతూ శిధిలమైన డ్రైనేజిలను, పాడైపోయిన సి.సి. రోడ్లను నూతనంగా నిర్మించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పోలమాంబ గుడి వద్ద కమ్యూనిటీ హాలులోని రెండవ ఫ్లోర్ నిర్మాణం నకు సాధ్యాసాద్యాలను పరిశీలించి, ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలువలలో చెత్త అధికంగా కనిపిస్తుందని, కాలువలో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతీ రోజూ డోర్ టు డోర్ చెత్తను తప్పనిసరిగా సేకరించాలని తడి-పొడి చెత్త వేరు వేరుగా తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రతపై, సీజనల్ వ్యాధులపై మహిళా సంఘాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబల కుండా ఫాగింగు చేయాలని మలేరియా సిబ్బందికి సూచించారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయకుండా చూడాలని ఆదేశించారు. వార్డు కార్పొరేటర్, ప్రజలు స్థానిక సమస్యలపై మేయర్ కమిషనర్ కు వివరించారు. ఈ పర్యటనలో ప్రధాన వైద్యాధికారి కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, నాలుగవ జోనల్ కమిషనర్ బి.వి.రమణ, ఎఎంఒహెచ్ డా. కిషోర్, కార్య నిరవాహక ఇంజినీర్లు చిరంజీవి, గణేష్ బాబు, ఇతర అధికారులు, వై.ఎస్.ఆర్. సి.పి. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు యజ్ఞంలా సాగాలి

### పలాసలో డివిజన్ స్థాయి సమీక్షలో పాల్గొన్న మంత్రి



శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న జగనన్న కాలనీల ఇళ్ళ నిర్మాణం యజ్ఞంలా సాగాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అధికారులను సూచించారు. మంగళవారం పలాసలో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి హౌసింగ్ హిమాన్షు కౌశిక్ ల సమక్షంలో డివిజన్ స్థాయి హౌసింగ్ సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పథకం జగనన్న కాలనీలు ఇళ్ళ నిర్మాణం అన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి మహిళల పేరున ఇళ్ళ పట్టాలు అందించి వారికి హక్కును కల్పించడం దేశంలో ఎక్కడా లేని విదంగా జరుగుతుందని అన్నారు. లబ్ధిదారులకు ఇళ్ళ నిర్మాణాలవైపు మొగ్గు చూపించాలని అన్నారు. ఇళ్లు లేని కుటుంబం ఉండ కూడదు అనే లక్ష్యంగా మొదటి దశలో మొత్తం 34 లక్షల ఇళ్ళ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. అందరికి పట్టాలు పంపిణీ చేశామని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఉన్న లోటుపాట్లను సమీక్షలో తెలుసుకున్నారు. ఇసుక, ఇటుక, సిమెంట్, ఐరన్ అందించడం తోపాటు నిర్మాణానికి యజమాని నుండి ఉపాది హామీ ద్వారా పని దినాలు కల్పించి కూలీలకు డబ్బులు ఏర్పాట్ల విషయాన్ని సమీక్షించారు. పేదవారు నిర్మాణం విషయంలో ఖర్చు చేయలేనటువంటి వారిని గుర్తించాలని కోరారు. వారికి ప్రభుత్వం ఇళ్ళు నిర్మాణం చేపట్టి అందిస్తుందని అన్నారు. పేదల ఇళ్ళ నిర్మాణంలో లబ్ధిదారులకు బిల్లులు మంజూరు విషయంలో జాప్యం జరగకుండా సకాలంలో వారికి డబ్బులు అందించ గలిగితే వారు ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు కొనసాగిస్తారని అన్నారు.

అంతే కాకుండా జగనన్న కాలనీలలో రోడ్లు, డ్రైనేజిలు, ఎలక్ట్రికల్, మంచినీటి సౌకర్యాలకు సంబందించిన పనులపై సమీక్ష చేపట్టారు. జగనన్న కాలనీలలో ప్రతి పని వేగవంతం కావాలని సూచించారు. టెక్కలి డివిజన్ లోని అన్ని మండలాల అధికారులతో పరిస్థితులపై చర్చించారు. పేదల ఇళ్ళ నిర్మాణం అనేది యుద్ధ ప్రాతిపదికన కొనసాగాలని ప్రజలకు అవగాహన కల్పించడం తోపాటు వారికి ఉన్న సమస్యలు గుర్తించి వేగవంతం చేయాలని కోరారు. మండలాల వారీగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ వికాస్ మర్మట్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కూర్మి నాయుడు, డ్వామా పిడి హెచ్.కూర్మారావు, ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస నియోజకవర్గాలకు సంబంధించిన ఆర్.డబ్ల్యూ.యస్ , ఎలక్ట్రికల్ , హౌసింగ్, డ్వామా అధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్, తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ బిల్లుకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు

న్యూఢిల్లీ: లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓబీసీ సవరణ బిల్లుకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎంపీలు మంగళవారం ఢిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. ఓబీసీ బిల్లుకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఓబీసీలను గుర్తించే అధికారం రాష్ట్రాలకు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు.

ఏయే కులాలు వెనకబాటు తనంలో ఉన్నాయో.. రాష్ట్ర ప్రభుత్వాలకే అవగాహన ఉంటుందన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ ఓబీసీలకు ఈరోజు వరకు పూర్తిగా న్యాయం జరగలేదని రాజ్యసభ ఎంపీ మోపిదేవి వెంకటరమణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఓబీసీల రిజర్వేషన్లను పలుమార్లు కేంద్రం దృష్టికి తెచ్చారని గుర్తు చేశారు. ఓబీసీ బిల్లును స్వాగతిస్తున్నామని తెలిపారు. బీసీ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్రం కేటాయిస్తున్న బడ్జెట్ నామమాత్రం బడ్జెట్ అని విమర్శించారు. అదే ఏపీలో సీఎం జగన్ బీసీల అభివృద్ధి కోసం 30 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తే..మరి 29 రాష్ట్రాలు ఉన్న కేంద్ర ప్రభుత్వం వెయ్యి కోట్లు మాత్రమే కేటాయించడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు.

సుమారు 67 ఏళ్ల నుంచి ఓబీసీ కేటగిరీ కింద వెనకబడి ఉన్న కులాలకు ఇన్ని సంవత్సరాలుగా అన్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ లోక్‌సభ ఎంపీ మార్గాని భరత్ అన్నారు.

వారికి ఈ రోజు కేంద్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం ఈ బిల్లును తీసుకురావడం మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కేంద్ర గుర్తించలేని ఓబీసీ కులాలు సుమారు 671 ఉన్నాయని, ఈ బిల్లు ద్వారా వారికి ప్రయోజనం చేకూరుతుందన్నారు.

# వరుణ్ బజాజ్లో పల్సర్ సర్వీస్ కార్నివాల్



విశాఖపట్నం : భారతదేశపు అభిమాన పల్సర్ విడుదల అయ్యి 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వరుణ్ బజాజ్ ఆగస్ట్ 9వ తేదీ నుండి 18వ తేదీ వరకు పల్సర్ వినియోగదారుల కొరకు పల్సర్ సర్వీస్ కార్నివాల్ ని మరియు బజాజ్ కస్టమర్ల కొరకు ఎక్స్ ఛేంజ్ & లోన్ మేళాను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా 35వ వార్డు కార్పొరేటర్ శ్రీ విల్లూరి భాస్కర రావు గారు మరియు వరుణ్ బజాజ్ సి.ఇ.ఓ. శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, అత్యధిక అమ్మకాలతో అందరి అభిమాన బైక్ గా, భారతదేశపు నం.1 స్పోర్ట్స్ బైక్ గా పేరుగాంచిన బజాజ్ పల్సర్ విడుదల అయ్యి 20 సంవత్సరాలు పూర్తి అయ్యాయని, ఈ సందర్భంగా పల్సర్ వినియోగదారుల కొరకు పల్సర్ సర్వీస్ కార్నివాల్ ని ఏర్పాటు చేశామని, ఇందులో ఉచిత 10 పాయింట్ హెల్త్ చెకప్, లేబర్ ఛార్జీలపై 10% డిస్కౌంట్, స్పేర్స్ పై ఆకర్షణీయమైన డిస్కౌంట్, అప్ గ్రేడ్ & ఎక్స్ ఛేంజ్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. మరియు ఎక్స్ ఛేంజ్ & లోన్ మేళాలో భాగంగా ప్రతి బజాజ్ పల్సర్ శ్రేణిపై రూ.5000 వరకు డిస్కౌంట్, పాత 2 వీలరు ఎకో ఛేంజ్ లో రూ.5000 వరకు అధిక ధర, స్పాట్ ఎక్స ఛేంజ్, స్పాట్ ఫైనాన్స్, స్పాట్ డెలివరీ సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరుణ్ సిబ్బంది మరియు కస్టమర్లు పాల్గొన్నారు.

# ఏపీలో కొత్తగా 1,461 కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో ఏపీలో 63,849 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 1,461 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. గత 24 గంటలలో కరోనా బారిన పడి 15 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 13,564 కు చేరింది. గత 24 గంటల్లో 2,113 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 19,52,736 మంది ఏపీలో డిశ్చార్జ్ అయ్యారు.

ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంగళవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 18,882 కరోనా కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. దీంతో రాష్ట్రంలో పాజిటివ్ కేసుల సంఖ్య 19,85,182 కు చేరింది. ఏపీలో ఇప్పటి వరకు 2,53,11,733 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.



విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున నీ మర్యాదపూర్వకంగా కలుసుకుని దుశ్శాలువతో సత్కరించి, పూల గుచ్చంతో సత్కరిస్తున్న నెడ్ క్యాప్ చైర్మన్ మరియు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర కె కె రాజు, వైకాపా మహిళా నాయకురాలు పేడాడ రమణి కుమారి, ఏపీ బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ యువశ్రీ, స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ నంబాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



**భారతీయ జనతా పార్టీ నేత, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ పి.వి.ఎన్. మాధవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మద్దిలపాలెం పిఠాపురం కాలనీ లోని మాధవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన 48వ వార్డు నాయకుడు గంకల అప్పారావు**

# పుష్ కార్టు లోని చెత్తను నేరుగా వాహనంలోనే వేయండి

### - జివిఎంసి కమిషనర్ డా. జి.సృజన



విశాఖపట్నం, ఆగస్టు-10:- పుష్ కార్టులలోని చెత్తను కింద వేయకుండా నేరుగా చెత్త తరలించే వాహనంలోనికి ఎత్తించాలని జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన శానిటరీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె జివిఎంసి పాత సమావేశ మందిరంలో ప్రజా ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు సరిగా శుభ్రం చేయడం లేదని, బహిరంగ ప్రదేశాలలో చెత్త కుప్పలు అధికంగా కనిపిస్తున్నాయని, శానిటరీ ఇన్స్పెక్టర్లు రెండు పూటలు వార్డులో తిరిగి పారిశుద్ధ్య కార్మికులచే పనిచేయించాలని, అనధికారికంగా పార్కింగ్ చేసి వదిలేసిన వాహనాలను పోలీసుల వారి సహాయంతో తొలగించాలని ఆదేశించారు. చెత్త నిర్వహణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని, రోడ్లు, కాలువలలో చెత్త కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. చెత్త వాహనాలపై కవర్లు తప్పనిసరిగా ఉండాలని, డ్రై వేస్ట్ రోడ్లపై పడకుండా చూడాలని, వాహనాలు రాలేదని చెత్త సేకరణ ఆపవద్దని, వాహనం వచ్చే వరకు పుష్ కార్టులు ద్వారా చెత్త సేకరించాలని, కొన్నిచోట్ల చెత్త సేకరణ సంతృప్తిని ఇచ్చినా, మరికొన్నిచోట్ల సరిగా జరగడం లేదని తెలిపారు. రోడ్లు స్వీపింగు చేసే యంత్రాలు వాటి నిర్దేశించిన సమయాలలో పని చేసే విధంగా వాటిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పుష్ కార్టులు రిపేర్ వస్తే వాటిని వెంటనే రిపేరు చేయించాలని కార్య నిర్వాహక ఇంజినీరు(మెకానికల్) వారిని ఆదేశించారు. ప్రతి చిన్న, పెద్ద దుకాణాల ముందు మూడు రంగుల చెత్త డబ్బాలు ఉండాలని, దుకాణాదారులు ముందు ఉన్న వ్యర్థాలను వారి సిబ్బందిచే ఎత్తించాలని సూచించారు. చెత్త నిర్వహణ వారు చేయని యెడల, వారి ట్రేడ్ లైసెన్స్ లు రద్దు చేయాలని తెలిపారు. ఇపిడిసిఎల్ వారు తొలగించిన చెట్ల కొమ్మలను ఎత్తడం లేదని అందుకు ఇపీడీసీఎల్ వారి వద్ద నుండి అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు. రాత్రి పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేసిన చెత్తను వెంటనే ఎత్తించాలని ఆదేశించారు. హెూం కంపోస్ట్ తయారు చేయు వారికి సహాయ సహకారాలు అందించాలని, 10 ఇల్లు ఉన్నచోట ఆర్.పి.లు, సి.వో.లు, ఆర్.డబ్ల్యూ.ఎ.ఎస్.ల ద్వారా హెూం కంపోస్ట్ పై అవగాహన కల్పించాలని సూచించారు. యూజర్ ఛార్జీలు ప్రతి 3 నెలల ఒకసారి వసూలు చేయాలని, ఎవరు ఏవిధంగా కడితే ఆ విధంగా వసూలు చేయాలని ఆదేశించారు. జివిఎంసి అదనపు కమిషనర్ డా. వి. సన్యాసి రావు మాట్లాడుతూ స్పందనలో, గ్రీవెన్స్ లో, ఆన్లైన్లో, డయల్ యువర్ మేయర్, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాల్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పూర్తి చేయాలని, పెండింగు లో ఉంచరాదని ఆదేశించారు. ఒ.డబ్ల్యూ.ఎం.ఎస్. స్కానర్సు రిపేర్లు ఉంటే, వెంటనే రిపేర్లు చేసి, ప్రతి ఇల్లు స్కాన్ చేయాలని 100 శాతం చెత్త నిర్వహణ జరగాలని, పారిశుద్ధ్య కార్మికులకు యాప్రాన్లు, గ్లౌజులు, చీపుర్లు మొదలైనవి అందించాలని, వారు హాజరు పక్కాగా ఉండాలని, చెత్త తరలించే వాహనాలకు మైక్ సిస్టం ఉండాలని, వార్డు ప్రత్యేక అధికారులు ప్రతిరోజు ఉదయం వార్డుల్లో పర్యటించి, మలేరియా కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి డా. కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, కార్యనిర్వాహక (మేకికల్) ఇంజినీరు చిరంజీవి, ఎఎంఒహెచ్ లు, వార్డు ప్రత్యేక అధికారులు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ప్రజా ఆరోగ్య సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com